Telugu Daily

వేములవాడ వార్త

మీకోసం మా అక్షరం

కరీంనగర్
సంపుటి 09
సంచిక: 50
ఆదివారం
22 నవంబర్
2026
పేజీలు: 08


Karimnagar, Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad www.vemulawadavaartha.in



ఏఐ వినియోగంపై మార్గదర్శకాలు రూపొందించాలి

- పరిశోధనలో ఎక్కడ, ఎంతవరకు వాడారో వెల్లడించాలి
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

2





యమునా తీరాన అస్తమయ సోయగం

యమునా నదిపై సూర్యుడు నెమ్మదిగా అస్తమిస్తుండగా, సమీపంలోని తాజ్‌మహల్ పరిసరాలు కనువిందు చేస్తున్నాయి. అస్తమయ సూర్యుడి బంగారు కిరణాలు తెల్లని పాలరాతి కట్టడంపై పరుచుకోవడంతో తాజ్‌మహల్ మరింత అందంగా మెరిసిపోతోంది. ఆకాశంలోని రంగులు, యమునా నదిలో ప్రతిబింబించే సూర్యకాంతి, వెనుక నిలిచిన ప్రేమకు చిహ్నం తాజ్‌మహల్.. ప్రకృతి, శిల్పకళ కలగలిసిన అపురూప దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. శనివారం ఆగ్రాలోని యమునా నది తీరంలో కనిపించిన అస్తమయ వేళ అందాలు.

సవాళ్లకే సవాల్ విసురుతా



12ఏళ్లలో ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరిచాం

- పేదరికం నుంచి 50 కోట్ల మంది బయటపడ్డారు
- ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైంది
- ఐఐటీ ఖరగ్‌పుర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ

ఖరగ్‌పుర్: తాను సవాళ్లకే సవాలు విసిరే వ్యక్తినని, ఆ ప్రయత్నాన్ని ఎప్పుడూ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశ తొలి ఐఐటీ అయిన పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పుర్ 75వ వార్షికోత్సవ (ప్లాటినం జూబ్లీ) వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుల కోసం నిర్బంధ శిబిరం ఉన్న ప్రాంతంలోనే ఈ విద్యాసంస్థను నిర్మించారని గుర్తుచేశారు. 75ఏళ్ల ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని, దేశాభివృద్ధి, ఆవిష్కరణల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. గత 12 ఏళ్లలో తమ ప్రభుత్వం అనేక అవకాశాలకు ద్వారాలు తెరిచిందని, పేద ప్రజలను శక్తిమంతం చేసిందని మోదీ తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలన అంశం ఎర్రకోట ప్రసంగాలు, ప్రభుత్వ దస్త్రాలకే పరిమితమయ్యేదని వ్యాఖ్యానించారు. అయితే, గత 12–13 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించిందని చెప్పారు. ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. సెమీకండక్టర్ మిషన్ గురించి తాను మాట్లాడినప్పుడు కొందరు ఆలస్యమైందని విమర్శించారని, ఇప్పుడు ఆ రంగంలో భారత్ ముందంజలో ఉందని పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాలు విద్యార్థులతో పాటు దేశానికి కూడా ఎంతో కీలకమని అన్నారు.

75 మంది విద్యార్థులతో ముచ్చట

1951లో స్థాపించిన ఐఐటీ ఖరగ్‌పుర్‌ను ప్రధాని మోదీ సందర్శించడం ఇదే తొలిసారి. ప్లాటినం జూబ్లీ సందర్భంగా స్మారక వెండి నాణేన్ని ఆవిష్కరించారు. అంతకుముందు '75 వాయిసెస్ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా 75మంది విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం విద్యార్థుల ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలు, పరిశోధన నమూనాలను పరిశీలించారు. వ్యవసాయం, వస్త్ర పరిశ్రమ, రోబోటిక్స్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్, డ్రోన్ సాంకేతికత, వైద్య రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులను తిలకించారు.

ఐఐటీకి గూగుల్ రూ.46 కోట్ల సాయం

అధునాతన ఏఐ పరిశోధనలకు మద్దతుగా ఐఐటీ ఖరగ్‌పుర్‌కు 50 లక్షల డాలర్లు (సుమారు రూ.46 కోట్లు) అందించేందుకు గూగుల్ ముందుకొచ్చింది. భారతీయ భాషలు, వ్యవసాయం, విద్య వంటి రంగాల్లో ఈ సంస్థ చేస్తున్న కృషిని మరింత వేగవంతం చేసేందుకు సహకరిస్తామని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. ఐఐటీ ఖరగ్‌పుర్ తన జీవితాన్ని తీర్చిదిద్దిందని, గూగుల్ అందించే సహకారం భవిష్యత్తు తరాల విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ ప్రయోజనాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ చేరాలన్న ప్రధాని మోదీ ఆశయానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.



పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు

- క్రమశిక్షణ విషయంలో అందరికీ ఒకే నిబంధన
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిస్తోంది
- సరైన సమయంలో అధిష్ఠానం నిర్ణయం
- పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

5

శ్రీవారికి రూ.160 కోట్ల బంగారు కానుక

- 121 కిలోల బంగారంతో 45 ఆభరణాల తయారీ
- ఈ నెల 26న టీటీడీకి భక్తుడి అందజేత
- తిరుమల చరిత్రలోనే అతిపెద్ద కానుక: టీటీడీ

5



ఎస్‌బీఐకి రోజుకు రూ.5వేల జరిమానా!

- రుణం తీర్చినా ఆస్తి పత్రాలివ్వడంలో ఏడేళ్ల జాప్యం
- బ్యాంకు సేవా లోపంగా తేల్చిన వినియోగదారుల కమిషన్
- న్యాయ ఖర్చులకు మరో రూ.10వేలు చెల్లించాలని ఆదేశం

5

ఎగుమతుల్లో 68శాతం వృద్ధి

- గత మూడేళ్లలో గణనీయమైన పురోగతి సాధించిన తెలంగాణ
- ఏరోస్పేస్, ఇంజినీరింగ్ రంగాల్లో ఎగుమతుల జోరు
- అన్ని జిల్లాలకూ అభివృద్ధి ఫలాలు
- తెలంగాణ రైజింగ్'తో మరింత వృద్ధి • సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, వీవీన్యూస్: తెలంగాణ నుంచి వస్తువులు, సేవల ఎగుమతులు గణనీయంగా పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో రాష్ట్ర ఎగుమతులు అంతకుముందు మూడేళ్లతో పోలిస్తే 68 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. తయారీ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలను ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. రాష్ట్రంలో ఏరోస్పేస్, ఇంజినీరింగ్ రంగాల ఎగుమతులు వేగంగా పెరుగుతున్నాయని సీఎం తెలిపారు. మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లోనూ ఎగుమతుల వృద్ధి నమోదవడం అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సమర్థవంతమైన పాలనతోనే ఈ పురోగతి సాధ్యమైందని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా అమలు చేయనున్న క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని, అన్ని ప్రాంతాల్లో అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ధీమా వ్యక్తం చేశారు.



సాంస్కృతిక కార్యక్రమాలకే కాళోజీ కళాక్షేత్రం

- అక్కడ ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలకు అవకాశం కల్పించవద్దు
- కాళోజీ ఫౌండేషన్‌తో చర్చించి కార్యక్రమాలు ఖరారు చేయాలి
- హన్మకొండ కలెక్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

5



గోల్ కొట్టేది మేమే!

- ఎన్నికల ఆట ఎలా ఆడాలో మాకు తెలుసు • బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఎన్ని రాజకీయ క్రీడలు ఆడినా ఫలితం ఉండదు
- రాష్ట్రంలో బీజేపీ నో మోర్.. 8మంది ఎమ్మెల్యేలను కాపాడుకుంటేనే గొప్ప
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

ఏఐ సాయంతో 160 ఏళ్ల గణిత సమస్యకు పరిష్కారం?

- 'రీమాన్ పరికల్పన'ను నిరూపించానన్న ఆంథ్రోపిక్ శాస్త్రవేత్త
- క్లాడ్ సాయంతో 1.7 కోట్ల లైన్ల కోడ్ రూపకల్పన
- నిరూపణను ఇంకా ధ్రువీకరించని గణిత సంస్థ

న్యూఢిల్లీ: గణిత శాస్త్రంలో 160 ఏళ్లకుపైగా పరిష్కారం కాని 'రీమాన్ పరికల్పన'ను కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో నిరూపించినట్లు ఆంథ్రోపిక్ సంస్థ ఉద్యోగి, గణిత శాస్త్రవేత్త లెవెంట్ అల్పోజ్ ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. తమ సంస్థకు చెందిన 'క్లాడ్' ఏఐ టూల్ సాయంతో ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నానని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నాలుగు పేజీల వివరణను తన వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సాధారణ గణిత పరిశోధనా పత్రానికి బదులుగా 'లీన్' అనే ప్రోగ్రామింగ్ భాషలో సుమారు 1.7 కోట్ల లైన్ల కోడ్‌ను విడుదల చేశారు. ఈ విషయాన్ని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఆంథ్రోపిక్ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించిన మరుసటి రోజే ఈ ప్రకటన రావడం గమనార్హం. 1859లో ప్రతిపాదించిన రీమాన్ పరికల్పన ప్రధాన సంఖ్యల పంపిణీకి సంబంధించిన కీలకమైన గణిత సమస్య. 2, 3, 5, 7, 11 వంటి ప్రధాన సంఖ్యలు పెరుగుతున్న కొద్దీ వాటి పంపిణీ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. స్వచ్ఛ గణిత శాస్త్రంలో ఇప్పటికీ పరిష్కారం కాని అత్యంత ముఖ్యమైన సమస్యల్లో ఇది ఒకటి. దీనికి సరైన నిరూపణను అందించిన వారికి 10 లక్షల డాలర్లు (రూ.9 కోట్లకుపైగా) బహుమతిగా ఇస్తామని క్లే మ్యాథమెటిక్స్ ఇన్‌స్టిట్యూట్ 2000లో ప్రకటించింది. అయితే, అల్పోజ్ ప్రకటన చేసినప్పటికీ ఈ సమస్య పరిష్కారమైనట్లు క్లే మ్యాథమెటిక్స్ ఇన్‌స్టిట్యూట్ ఇంకా గుర్తించలేదు. ఆయన సమర్పించిన నిరూపణను స్వతంత్రంగా పరిశీలించి, ధ్రువీకరించాల్సి ఉంది. ఏఐ రూపొందించిన ఫలితాలను గణిత శాస్త్రవేత్తలు లోతుగా పరిశీలించి, వాటి సరైనతను నిర్ధారించడానికి సమయం పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

టీవీకే ప్రభుత్వం దానంతట అదే కూలిపోతుంది

- తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి వ్యాఖ్యలు
- శాంతిభద్రతల వైఫల్యం, ధరల పెరుగుదలపై విమర్శలు
- అవిశ్వాస తీర్మానంపై వస్తున్న వార్తలు ఊహాగానాలేనని స్పష్టీకరణ

కోయంబత్తూరు: తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేదని, సమస్యల కారణంగా దానంతట అదే కూలిపోయే అవకాశం ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి అన్నారు. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అన్నాడీఎంకే సిద్ధమవుతోందన్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. ప్రభుత్వాన్ని పడగొట్టేంత సంఖ్యాబలం తమ పార్టీకి లేదని స్పష్టం చేశారు. కోయంబత్తూరులో మీడియాతో పళనిస్వామి మాట్లాడుతూ.. '41 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని అన్నాడీఎంకే ఎలా కూల్చగలదు? అసెంబ్లీలో మాకు అంత సంఖ్యాబలం లేదు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నామంటూ వస్తున్న వార్తలు మీడియా ఊహాగానాలే' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ధరల పెరుగుదల, క్షీణిస్తున్న శాంతిభద్రతలు, పారిశ్రామిక అభివృద్ధిలో ప్రభుత్వ వైఫల్యం వంటి సమస్యలు టీవీకే సర్కారుకు ఇబ్బందిగా మారతాయని విమర్శించారు. పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోతున్నా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. మెకెదాటు ప్రాజెక్టు విషయంలోనూ నిర్దిష్టమైన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. కర్ణాటక నుంచి తమిళనాడుకు రావాల్సిన నీటి వాటాను సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని పళనిస్వామి అన్నారు. ఇటీవల దిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి విజయ్ ఈ అంశాన్ని ప్రస్తావించలేదని విమర్శించారు. ఈ సమస్యలన్నింటి కారణంగా టీవీకే ప్రభుత్వం తనంతట తానే కూలిపోయే పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు.

అమెరికా ఎఫ్–16పై దాడి చేశాం

- ఎయిర్‌బేస్‌లో అత్యవసరంగా దిగిన పైలట్
- హర్మూజ్ జలసంధిలో డ్రోన్‌ను కూల్చివేశాం
- ఐఆర్‌జీసీ ప్రకటన.. ఖండించిన అమెరికా


కైరో: అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణిస్తున్న అమెరికా ఎఫ్–16 యుద్ధ విమానంపై తమ వాయు రక్షణ వ్యవస్థ దాడి చేసిందని ఇరాన్ సైన్యం ప్రకటించింది. క్షిపణి దాడితో విమానం దెబ్బతినడంతో పైలట్ మిషన్‌ను మధ్యలోనే నిలిపివేసి సమీపంలోని ఎయిర్‌బేస్‌లో అత్యవసరంగా దిగాల్సి వచ్చిందని తెలిపింది. అయితే, ఈ వాదనను అమెరికా ఖండించింది. ఇరాన్ అసత్య ప్రచారం చేస్తోందని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) స్పష్టం చేసింది. తమ యుద్ధ విమానాలన్నీ పశ్చిమాసియాలో సురక్షితంగా ఉన్నాయని వెల్లడించింది. ఇరాన్ ఆర్మీ పబ్లిక్ రిలేషన్స్ విభాగం విడుదల చేసిన ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన వాయు రక్షణ వ్యవస్థ తమ సమీకృత ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్ నియంత్రణలో పనిచేస్తోందని పేర్కొంది. అయితే, అమెరికా సెంట్రల్ కమాండ్ మాత్రం ఎఫ్–16పై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేసింది. మరోవైపు, హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్తున్న అమెరికాకు చెందిన ఎంక్యూ–9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఇప్పటివరకు 58 అమెరికా డ్రోన్లను కూల్చినట్లు తమ వద్ద లెక్క ఉందని పేర్కొంది. అయితే, ఎఫ్–16పై దాడి జరిగిందన్న ఇరాన్ వాదనను అమెరికా ఖండించినప్పటికీ, డ్రోన్ కూల్చివేతపై ఈ ప్రకటనలో స్పష్టమైన స్పందన ఇవ్వలేదు.

నా మాట విన్నారు.. డబ్బు ఆదా చేసుకున్నారు

- బంగారం కొనుగోళ్లు తగ్గించడంతో ప్రజలకు మేలు
- ధరలు తగ్గిన నేపథ్యంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- ఏడాది పాటు కొనొద్దని గతంలో విజ్ఞప్తి



లక్నో: దేశ ప్రజలు తన విజ్ఞప్తిని పాటించి బంగారం కొనుగోళ్లను తగ్గించడంతో డబ్బు ఆదా చేసుకోగలిగారని ప్రధాని నరేంద్ర మో దీ అన్నారు. కొన్ని నెలల క్రితం తాను చేసిన సూచనను పాటించినవారు ఇప్పుడు సంతో షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అవసరం లేకపోతే ఏడాది పాటు బంగారం కొనుగోలు చేయవద్దని గతంలో కోరిన విషయాన్ని గుర్తు చేశారు. లక్నో నిర్వహించిన ఓ కార్యక్రమం లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'గతంలో ఏడాది పాటు అవసరం లేకపోతే బంగారం కొనవద్దని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశా. రోజు కు ఒకపూట భోజనం మానేయాలని అప్ప ట్లో లాల్ బహదూర్ శాస్త్రి చేసిన పిలుపును పాటించిన ప్రజల స్ఫూర్తి ఇప్పటికీ కొనసాగ డం సంతోషంగా ఉంది. నాలాంటి సాధారణ వ్యక్తి చేసిన విజ్ఞప్తిని కూడా ప్రజలు పరిగణన లోకి తీసుకున్నారు. బంగారం కొనుగోళ్లు త గ్గించుకున్నారు. దీంతో తమ డబ్బు ఆదా అ యిందని ఇప్పుడు పలువురు చెబుతున్నారు. బంగారం ధరలు కూడా తగ్గాయి' అని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల కార ణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయ ని, ఈ నేపథ్యంలో ఏడాది పాటు కొనుగోళ్ల ను నిలిపివేయాలని ఈ ఏడాది మేలో ప్రధాని పిలుపునిచ్చారు. పండుగలు, శుభకార్యాల సందర్భాల్లోనూ బంగారం కొనుగోలుపై ఆ సక్తి చూపవద్దని సూచించారు. సికింద్రాబా ద్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ.. బంగా రం దిగుమతులు తగ్గితే విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని వివరించారు. తాజాగా ధరలు తగ్గిన నేపథ్యంలో గతంలో చేసిన విజ్ఞప్తిని మోదీ ప్రస్తావించారు.



ఈ–ప్రిస్క్రిప్షన్ విధానాన్ని పాటించండి

- వైద్య విద్య సమాజం ఇచ్చిన వరం.. ప్రజలకు సేవ చేయాలి
- యువ వైద్యులకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా పిలుపు
- ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగస్వాములు కావాలని సూచన



పుదుచ్చేరి: యువ వైద్యులు ఈ–ప్రిస్క్రిప్షన్ విధానాన్ని పాటిస్తూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగస్వాములు కావాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా పిలుపునిచ్చారు. వైద్య వృత్తిలోకి అడుగుపెడుతున్న వారిపై సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మర్) 15వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 816 మందికి వైద్య డిగ్రీలు ప్రదానం చేశారు. అనంతరం యువ వైద్యులను ఉద్దేశించి నడ్డా మాట్లాడుతూ.. వైద్యులుగా మారడం సమాజం ఇచ్చిన వరమని, అందుకు ప్రతిగా ప్రజలకు సేవ చేయాల్సిన సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రాథమిక, మాధ్యమిక విద్య ప్రతి ఒక్కరి హక్కు అయినప్పటికీ.. వైద్య విద్య సమాజం, ప్రభుత్వం అందించే సహకారంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వైద్య విద్యలో మరో 10 వేల గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గతేడాది కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు కేటాయించిందని నడ్డా తెలిపారు. ఒక్కో వైద్య విద్య సీటుపై నాలుగేళ్లలో రూ.1.5 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం, సమాజం కల్పిస్తున్న అవకాశాలు, వనరులను సద్వినియోగం చేసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని యువ వైద్యులకు సూచించారు.

ప్రజలను దూరం పెడితే భద్రతకు ముప్పు


- లద్దాఖ్‌లో ప్రభుత్వ నిర్ణయాలను బలవంతంగా రుద్దుతున్నారు
- ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు
- పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్
- కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో విచారణ కమిషన్‌కు డిమాండ్



లేహ్: లద్దాఖ్‌లో స్థానికుల అభిప్రాయాలను పట్టించుకోకుండా ప్రభుత్వ నిర్ణయాలను వారిపై బలవంతంగా రుద్దుతున్నారని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ విమర్శించారు. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సరిహద్దు ప్రాంతంలో ప్రజలను పాలనకు దూరం చేస్తే జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. స్థానికుల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడం, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చడం, భూములకు రక్షణ కల్పించడం, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించడం తదితర డిమాండ్లతో లేహ్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. శనివారం ఈ నిరసనల్లో పాల్గొన్న వాంగ్‌చుక్.. లేహ్ అపెక్స్ బాడీ చైరింగ్ దోర్జేతో కలిసి మీడియాతో మాట్లాడారు. పాలనపై స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా వారి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. లద్దాఖ్ సమస్యను కేవలం లెఫ్టినెంట్ గవర్నర్ లేదా కేంద్ర హోంశాఖ పరిధిలోని అంశంగా చూడకుండా జాతీయ భద్రత కోణంలోనూ పరిశీలించాలని వాంగ్‌చుక్ సూచించారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జోక్యం చేసుకోవాలని కోరారు. దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు లభిస్తున్న ప్రజాస్వామ్య హక్కులన్నీ లద్దాఖ్ వాసులకూ కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమస్యలను తెలుసుకోవడంతోపాటు పాలనపై వారి అభిప్రాయాలను సేకరించేందుకు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ తీరుపై స్థానిక ఉద్యోగులు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వాంగ్‌చుక్ పేర్కొన్నారు.

ఏఐ వినియోగంపై మార్గదర్శకాలు రూపొందించాలి

- ఎక్కడ, ఎంతవరకు వాడారో వెల్లడించాలి
- న్యాయ విద్యలో సామాజిక సేవ తప్పనిసరి చేయాలి
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



హైదరాబాద్, వీవీన్యూస్: న్యాయ పరిశోధనలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. పరిశోధనలో ఏఐ సాయాన్ని ఎక్కడ, ఎంతమేరకు ఉపయోగించారో వెల్లడించేలా నిబంధనలు ఉండాలని, కామన్వెల్త్ దేశాల్లోని న్యాయ విద్యాసంస్థలు, న్యాయ పత్రికలు వాటిని అనుసరించేలా కామన్వెల్త్ లీగల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (సీఈఎల్‌ఏ) చొరవ తీసుకోవాలని కోరారు. న్యాయ విద్య పూర్తి చేయాలంటే విద్యార్థులు కొంత కాలం తప్పనిసరిగా న్యాయ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని, అదనంగా సేవలందించే వారికి అకడమిక్ క్రెడిట్లు ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సీఈఎల్‌ఏ తొలి వార్షిక అంతర్జాతీయ న్యాయ విద్యా సదస్సులో ఆయన ప్రసంగించారు. ఏఐ ఇచ్చే సమాధానాలన్నీ కచ్చితమైనవని భావించరాదని సీజేఐ హెచ్చరించారు. లేని న్యాయపరమైన ఆధారాలను సైతం ఉన్నట్లుగా చూపించే ప్రమాదం ఉందని, అందువల్ల పరిశోధకులు ప్రతి అంశాన్నీ అసలు మూల పత్రాలతో ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఏఐ వినియోగాన్ని వెల్లడించడంతోపాటు ప్రచురించిన సమాచారానికి పరిశోధకులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఏఐని పూర్తిగా నిషేధించడం కంటే స్పష్టమైన నిబంధనలతో బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించడం మంచిదన్నారు. విద్యార్థుల రచనలను ఏఐ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ల నివేదికల ఆధారంగా మాత్రమే అంచనా వేయకూడదని సూచించారు. ఆంగ్లం మాతృభాష కాని విద్యార్థుల రచనల్లో 60 శాతానికి పైగా వ్యాసాలను ఏఐ రూపొందించినవిగా గుర్తించినట్లు 2023 అధ్యయనం వెల్లడించిందని తెలిపారు. అందువల్ల రాత పరీక్షలతోపాటు మౌఖిక వివరణ, ఆధారాలను సమర్థించుకోవడం వంటి పద్ధతులనూ మూల్యాంకనంలో ప్రవేశపెట్టాలని అన్నారు.

న్యాయ విద్యార్థులను ప్రోత్సహించాలి

న్యాయ విద్యార్థులు గ్రామాలు, నివాస ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు న్యాయ సహాయం అందించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. న్యాయ సహాయ కేంద్రాల్లో పనిచేసే విద్యార్థులకు సేవల ఆధారంగా ధ్రువపత్రాలు, అదనపు క్రెడిట్లు ఇవ్వాలని సూచించారు. న్యాయ పాఠ్యాంశాల్లోనూ క్షేత్రస్థాయి అనుభవానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. కామన్వెల్త్ దేశాల్లోని న్యాయస్థానాల తీర్పులకు ఉమ్మడి గుర్తింపు విధానం ఉండాలని సీజేఐ అభిప్రాయపడ్డారు. తీర్పు సంవత్సరం, న్యాయస్థానం పేరు, నిర్ణయ సంఖ్య, సంబంధిత పేరా వివరాలతో కూడిన న్యూట్రల్ సైటేషన్ విధానాన్ని అనుసరిస్తే వివిధ దేశాల తీర్పులను గుర్తించడం, ధ్రువీకరించడం సులభమవుతుందని పేర్కొన్నారు.

నాట్కో ఫార్మాకు యూఎస్ఎఫ్‌డీఏ ఏడు అభ్యంతరాలు

- హైదరాబాద్ కొత్తూరు ప్లాంట్‌లో తనిఖీల అనంతరం ఫామ్–483 జారీ

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని కొత్తూరులో ఉన్న తమ తయారీ కేంద్రానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) ఏడు అభ్యంతరాలు తెలియజేసినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. నవంబరు 12 నుంచి 20 వరకు సంస్థ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించిన అనంతరం ఫామ్–483 కింద ఈ అభ్యంతరాలు జారీ చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన సమాచారంలో పేర్కొంది. తనిఖీల సందర్భంగా నిబంధనల ఉల్లంఘనలకు అవకాశం ఉన్న అంశాలను గుర్తించినప్పుడు యూఎస్ఎఫ్‌డీఏ ఫామ్–483 నోటీసు జారీ చేస్తుంది. అయితే తమకు వచ్చిన ఏడు అభ్యంతరాలూ విధానపరమైనవేనని నాట్కో ఫార్మా తెలిపింది. నిర్దేశిత గడువులోగా వాటన్నింటినీ సమగ్రంగా పరిష్కరిస్తామన్న విశ్వాసం ఉందని పేర్కొంది.



ఈశాన్య అభివృద్ధి చరిత్రలో సువర్ణాధ్యాయం

- 2014–2026 మధ్య ప్రగతి మరువలేనిది
- మౌలిక సదుపాయాలు, రవాణా కనెక్టివిటీతో వేగంగా అభివృద్ధి
- కశ్మీర్‌లో శాంతి నెలకొంది.. యువత ఉగ్రవాదానికి దూరంగా ఉన్నారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఇటానగర్: భారతదేశ చరిత్రను ఎప్పుడు రాసినా 2014–2026 మధ్య ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన అభివృద్ధిని సువర్ణాక్షరాలతో లిఖిస్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈ ప్రాంతానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమి చేసిందని పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించడం నవ్వు తెప్పిస్తోందని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాల కల్పన, విమానాశ్రయాలు, రైల్వే కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడ్డాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 11,200 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్రతిపాదించిన 'సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు'పై స్థానికుల్లో ఉన్న ఆందోళనలను త్వరలో తొలగిస్తామని అమిత్ షా చెప్పారు. ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే క్రమంలో స్థానికుల సంస్కృతి, సంప్రదాయాలు, మత విశ్వాసాలకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత గణనీయమైన మార్పులు వచ్చాయని అమిత్ షా పేర్కొన్నారు.

మూడున్నర దశాబ్దాలకు పైగా అశాంతి, హింసను ఎదుర్కొన్న కశ్మీర్ లోయలో ప్రస్తుతం శాంతి నెలకొందన్నారు. స్థానిక యువత ఉగ్రవాదానికి దూరమైందని చెప్పారు. ఉగ్రవాదులను ఏరివేయడంతో పాటు యువతలోని వివక్ష, పరాయీకరణ భావనలను తొలగించడం వల్లే ఈ మార్పు సాధ్యమైందని వివరించారు. 2014 నుంచి ప్రధాని మోదీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు శాశ్వత శాంతికి బాటలు వేస్తున్నాయని అమిత్ షా అన్నారు.

భారత్ ఎదుగుదలపై చైనా కుట్ర

- 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్‌కు సైనిక, సాంకేతిక సాయం
- సరిహద్దుల్లో ఒత్తిడి.. పారిశ్రామిక సరఫరాలపైనా ఆంక్షలు
- అమెరికా కాంగ్రెస్ ప్యానెల్ వార్షిక నివేదికలో వెల్లడి



వాషింగ్టన్: భారత్ ఎదుగుదలను అడ్డుకునే లక్ష్యంతో చైనా వ్యవహరిస్తోందని అమెరికా కాంగ్రెస్ ప్యానెల్ వెల్లడించింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక, సాంకేతిక మద్దతు అందించిందని పేర్కొంది. భారత్‌ను అదుపులో ఉంచేందుకు సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడంతో పాటు పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధిస్తోందని తెలిపింది. యూఎస్–చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ తన వార్షిక నివేదికలో ఈ అంశాలను ప్రస్తావించింది. ఆసియాలో చైనాను ఎదుర్కోవడంలో భారత్ కీలకపాత్ర పోషిస్తోందని, ఈ విషయం బీజింగ్‌కు కూడా తెలుసని నివేదిక పేర్కొంది. అందుకే పలు రంగాల్లో భారత్ పురోగతిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని తెలిపింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో చైనా నేరుగా యుద్ధంలో పాల్గొనకపోయినా.. పాకిస్థాన్‌కు సాంకేతిక, సైనిక సహకారం అందించి ఆ దేశ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయత్నించిందని వివరించింది. పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతో పాటు చైనా తన సైనిక బలగాలను బలోపేతం చేసుకుంటోందని, హిందూ మహాసముద్రంలో నౌకాదళ ఉనికిని, నిఘా కార్యకలాపాలను విస్తరిస్తోందని నివేదిక తెలిపింది. భారత్–చైనా సంబంధాల పునరుద్ధరణకు ఇరు దేశాలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి తన సైనిక సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నాలను బీజింగ్ కొనసాగిస్తోందని పేర్కొంది. ఇందుకోసం విమానాశ్రయాలు, రైల్వేలు, రవాణా, సైనిక అవసరాలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలను విస్తరిస్తోందని వెల్లడించింది. చైనా ఎత్తుగడలను ఎదుర్కోవడానికి భారత్.. అమెరికాతో నిఘా, సముద్ర భద్రత, ఉత్పాదక రంగాల్లో మరింత విస్తృతమైన సహకారాన్ని పెంపొందించుకోవాలని కాంగ్రెస్ ప్యానెల్ సూచించింది. ఇదిలా ఉంటే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు క్షేత్రస్థాయిలో సాంకేతిక సహకారం అందించినట్లు చైనా ఇప్పటికే అంగీకరించింది. చైనాకు చెందిన ఏవీయేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ (ఏవీఐసీ) ఇంజినీర్ ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు.



హిత చింతక్ అభియాన్‌లో ప్రతి హిందువు భాగస్వామ్యం కావాలి

- వేములవాడలో నేటి నుంచి ఇంటింటికీ సభ్యత్వ నమోదు

వేములవాడ, వీవీన్యూస్: హిందూ ఐక్యత, ధర్మ రక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న హిత చింతక్ అభియాన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి హిందువు భాగస్వామ్యం కావాలని నాయకులు గజం రాజు పిలుపునిచ్చారు. శనివారం వేములవాడలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, నవంబర్ 22, ఆదివారం నుంచి వేములవాడ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ హిత చింతక్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. హిందూ సమాజంలో ధార్మిక, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడమే ఈ అభియాన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. యువత, మహిళలు, మేధావులు, వ్యాపారులు, ఉద్యోగులు, ప్రతి కుటుంబం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హిత చింతక్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు కోసం కార్యకర్తలు ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలందరూ సానుకూలంగా స్పందించి సహకరించాలని, ఈ అభియాన్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గడప కిషోర్ రావు, నాగుల రాము, గన్నమనేని ప్రదీప్ రావు, పల్లె శ్యాంసుందర్ రెడ్డి, గుండోజు గోపాల్, ననుగుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో 36మంది విజేతలు

కరీంనగర్, వీవీన్యూస్ : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కరీంనగర్‌లోని సాయి మానేరు ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ మండలాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కొత్తపల్లి ప్రైవేట్ విభాగంలో ఎస్. రిశాల్, ఓ. శివ స్మరణ్ రెడ్డి, ఆర్. అమిత్ కార్తీక్; కరీంనగర్ టౌన్ విభాగంలో కే. తేజస్విని, జి. అన్విత, ఎస్. హార్దిక్; రామడుగు ప్రైవేట్ విభాగంలో సీహెచ్. స్వాతి, కె. రిత్విక్ గుప్తా, బి. వర్షిత్ రెడ్డి విజేతలుగా నిలిచారు. కరీంనగర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ విభాగంలో వి. హర్షిత్, సీహెచ్. విశ్వతేజ, ఎండీ. ఆస్లమ్ పాషా; తిమ్మాపూర్ రెసిడెన్షియల్ విభాగంలో బి. జెస్సీ, వి. వైశాలి, టీ. అశ్విని; కరీంనగర్ రూరల్ విభాగంలో ఏ. శివకుమార్, ఎండీ. రహమాన్, బి. కౌశిక్ విజయం సాధించారు. కొత్తపల్లి బాలికల విభాగంలో ముస్కాన్ తన్వీర్, నూ అంజుం, జె. సహస్ర; చొప్పదండి విభాగంలో ఎం. అజయ్, పవర్ రితేష్, ఎం. అజిత్; తిమ్మాపూర్ ప్రైవేట్ విభాగంలో పి. శ్లోకగ్న, డి. యశస్వి, ఎం. శ్రీవర్షిణి ప్రతిభ చాటారు. కరీంనగర్ పట్టణ ప్రభుత్వ విభాగంలో బి. శ్రీహిత, కె. హర్షవర్ధన్, హృదయవర్ధన్ రెడ్డి; తెలుగు మీడియం విభాగంలో ఆర్. గణేష్, ఏ. సహస్ర, కె. గౌతమ్ విజేతలుగా నిలిచారు. వీరంతా ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎన్. దేవేందర్, కార్యదర్శి ఆర్. వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.



బీజేపీలో 200మంది యువకుల చేరిక

కోనరావుపేట, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలానికి చెందిన సుమారు 200 మంది యువకులు శనివారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు నాయకత్వంలో కరీంనగర్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



ఇందిరమ్మ బీమాను వినియోగించుకోవాలి

వేములవాడ, వీవీన్యూస్: ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు.కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవిత బీమా ఎంతో భరోసానిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజల భవిష్యత్తుకు భద్రత కల్పించే ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సుధీర్ తదితరులు ఉన్నారు.

యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

- ఆర్ఐ అడ్మిన్ సురేష్



సిరిసిల్ల, వీవీన్యూస్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ ఉదయం కనీసం అరగంట పాటు యోగా, ధ్యానం లేదా నడక అలవాటు చేసుకోవాలని ఆర్ఐ అడ్మిన్ సురేష్ సూచించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు ఆర్.ఐ అడ్మిన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ మైదానంలో ఆర్మ్డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన వివిధ డ్రిల్స్‌ను ఆర్.ఐ అడ్మిన్ పరిశీలించారు. సాధ్యమైనంత వరకు బయట ఆహారం తీసుకోవడం తగ్గించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వీక్లీ పరేడ్ ద్వారా పోలీస్ సిబ్బందిలో క్రమశిక్షణ, ఐక్యత, సమన్వయం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్. సతీష్ కుమార్ సిబ్బందికి గుండె ఆరోగ్యం, గుండెపోటు నివారణ, రక్తపోటు, మధుమేహం, ఆరోగ్యకరమైన జీవనశైలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్.ఐ రమేష్, పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్.ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- చందుర్తిలో ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ
- 61 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, వీవీన్యూస్: దేశాభివృద్ధికి, ముఖ్యంగా పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆమె ఆశయాలు, స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల నమూనా గృహాన్ని ప్రారంభించారు. మండల పరిధిలోని 61మంది లబ్ధిదారులకు రూ. 16.51 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. తిమ్మాపూర్‌లో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ పాలనలో బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, భూసంస్కరణలు వంటి నిర్ణయాలతో సామాజిక మార్పునకు పునాది పడిందన్నారు. 'గరీబీ హఠావో' నినాదంతో పేదల సంక్షేమానికి ఆమె విశేష కృషి చేశారని గుర్తుచేశారు. గతంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న చందుర్తిలో ఇప్పుడు ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కాంగ్రెస్ మహానేతల ఆశయాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని



తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులు, విగ్రహ దాతలను అభినందించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ ఇందిరమ్మ పేరుతో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండ

వేములవాడ: ఆపద సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేములవాడ రూరల్ పరిధిలోని అర్హులైన 38 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల 92 వేల, అర్బన్ మండల పరిధిలో 31 మంది లబ్ధిదారులకు 9 లక్షల 47 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, వారి కష్టాల్లో భాగస్వామి అవుతోందన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్నారు.

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న విప్



జగిత్యాల, వీవీన్యూస్: జగిత్యాల జిల్లా కొండగట్టులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి చందనోత్సవం, పుష్ప సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి నిజరూప దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

స్వచ్ఛ శౌచాలయాలతోనే గౌరవప్రదమైన భవిష్యత్



- పోస్టర్లు, బ్యానర్ ఆవిష్కరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, వీవీన్యూస్: జిల్లాలోని అన్ని గ్రామాల్లో 'స్వచ్ఛ శౌచాలయం.. గౌరవప్రదమైన భవిష్యత్' నినాదంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఐడీఓసీలో అధికారులతో కలిసి పోస్టర్లు, బ్యానర్‌ను ఆవిష్కరించారు. అక్టోబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని, ఉన్నవాటిని తప్పనిసరిగా వినియోగంలో ఉంచాలని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీలు, వీవో భవనాలు, బహిరంగ ప్రదేశాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లకు నీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. చేతుల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, ఎన్‌బీఎం బాధ్యులు సురేష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శనివారం ఐడీఓసీలో విద్యాశాఖ, పంచాయతీరాజ్, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో ఎఫ్ఆర్ఎస్, ఎఫ్ఎల్ఎన్, ఆన్‌లైన్ తరగతులు, పాఠశాలల అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో పాటు నాబార్డ్, పీఎం ఉష నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి విజయసాగర్, ఈఈ సుదర్శన్ రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠినచర్యలు

- తరచూ పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు
- ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల, వీవీన్యూస్: జిల్లాలో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో పదేపదే పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువుల అక్రమ విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు శనివారం పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, నిల్వలు, బిల్లులు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో నష్టపోకుండా పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా



బిల్లు తీసుకోవాలని సూచించారు. నాణ్యతపై అనుమానం ఉన్నా, నకిలీ విత్తనాలు లేదా పురుగుమందులు విక్రయిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. తనిఖీల్లో పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కోనరావుపేట: రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి దుర్గరాజు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి తదితర గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో ఎస్ఐ రామ్మోహన్‌తో కలిసి అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయించినా, కల్తీ విత్తనాలు అమ్మినా లైసెన్సులు రద్దు చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- వేములవాడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

వేములవాడ, వీవీన్యూస్: పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, సిబ్బంది పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీటీఎన్ఎస్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారి భద్రతా చర్యల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ వీరప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





వివాహ వేడుకకు కుటుంబసమేతంగా హాజరైన ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్, వీవీన్యూస్ : కరీంనగర్‌లోని దాసరి విజయ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన వివాహ వేడుకకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. గన్నేరువరం మండలం గుండ్లపల్లి క్రాస్ రోడ్డు గ్రామానికి చెందిన వంగల నర్సింహారెడ్డి – సులోచన దంపతుల కుమార్తె ఆశ్రిత వివాహానికి ఎమ్మెల్యే తన సతీమణి, అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ అనురాధ, కుమార్తె శ్రేయా నారాయణ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా అదనపు కలెక్టర్ (శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఆకుల నర్సయ్య (కరీంనగర్), కరరేవెల్లి రాజలింగం (మానకొండూర్), మాతంగి శిరీష–అనిల్ కుమార్ (బెజ్జంకి), అంతగిరి సాహిత్య–వినయ్ కుమార్ (ఇల్లంతకుంట), మాజీ ఏఎంసీ చైర్మన్లు పులి కృష్ణ, మర్రి ఓదెలు యాదవ్, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్లు రేవెల్లి శ్రీనివాస్ రెడ్డి, పర్ష సంతోష్, జె.భరత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డిలు తదితరులు ఉన్నారు.

పేదింటి వధువు వివాహానికి వైస్ చైర్మన్ చేయూత



సిరిసిల్ల, వీవీన్యూస్: స్థానిక 34వ వార్డు కు చెందిన పేదింటి కుటుంబంలోని వధువు వివాహానికి సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. సామల సత్యనారాయణ–ప్రభావతీ దంపతులకు కుమార్తె సామల రమ వివాహ మహోత్సవం సందర్భంగా తన వంతు సహాయం గా 50 కేజీల బియ్యాన్ని అందించి నూతన వధువును మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సామల సత్యనారాయణ ప్రభావతి దంపతులు మాట్లాడుతూ తమ కుమార్తె వివాహం సందర్భంగా మంచి హృదయంతో తమకు 50 కేజీల బియ్యాన్ని అందించి ఈ సమయంలో అండగా నిలిచిన వైస్ చైర్మన్ దార్ల సందీప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామల సత్యనారాయణ కుటుంబ సభ్యులు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటరు నమోదు చేసుకోవాలి: సీఈసీ

సిరిసిల్ల, వీవీన్యూస్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు లభించిన చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్‌లో భాగంగా ఏఎస్‌డీడీ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించి, అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకోని అర్హులను గుర్తించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశానికి సిరిసిల్ల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నప్పటికీ నివాసం మారని వారు నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, నివాసం మారిన వారు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనుబంధ పత్రం సమర్పించాలని సుదర్శన్ రెడ్డి తెలిపారు.

ఈ-వే బిల్లులో ఐదో రవాణా మార్గంగా మెట్రో

• ఇకపై సరుకుల రవాణాకు మెట్రో రైలు ఎంపిక

న్యూఢిల్లీ: వస్తువుల రవాణాకు సంబంధించిన ఈ–వే బిల్లు వ్యవస్థలో మెట్రో రైలును ఐదో రవాణా మార్గంగా జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) చేర్చింది. ఇప్పటివరకు రోడ్డు, రైలు, విమానం, నౌక మార్గాలే అందుబాటులో ఉండగా.. తాజాగా మెట్రో రైలునూ జోడించింది. అక్టోబరు 26న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు ఈ మార్పు చేసినట్లు జీఎస్‌టీఎన్ వెల్లడించింది. కొత్త సదుపాయం ప్రస్తుతం వెబ్ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. మెట్రో ద్వారా సరుకులు తరలించేవారు ఈ–వే బిల్లు రూపొందించే సమయంలో రవాణా మార్గంగా మెట్రో రైలును ఎంచుకుని, రవాణా పత్రం నంబరును నమోదు చేయాలి. వాహన వివరాల మార్పు, కన్సాలిడేటెడ్ ఈ–వే బిల్లుల తయారీ, పునఃతయారీలోనూ ఈ ఎంపిక అందుబాటులో ఉంటుందని నవంబరు 20న జారీ చేసిన సూచనల్లో పేర్కొంది. జీఎస్‌టీ పోర్టల్‌కు అనుసంధానమైన సాఫ్ట్‌వేర్ ద్వారా బిల్లులు రూపొందించే వ్యాపార సంస్థలు, రవాణాదారులు ఏపీఐ వినియోగదారులుగా ఉంటారు. వీరు తమ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసుకునేందుకు ఈ సదుపాయాన్ని ప్రస్తుతం శాండ్‌బాక్స్ వాతావరణంలో పరీక్షించుకోవచ్చు. ప్రత్యక్ష ఏపీఐ వ్యవస్థలో ఎప్పటి నుంచి అందుబాటులోకి తెస్తారో జీఎస్‌టీఎన్ తర్వాత ప్రకటించనుంది. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం రాష్ట్రాల మధ్య, రాష్ట్రాల పరిధిలో రూ.50 వేలకు మించిన విలువైన వస్తువులను రవాణా చేసేటప్పుడు ఈ–వే బిల్లు తప్పనిసరి.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలను రూపొందించాలి

• మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి



సిరిసిల్ల, వీవీన్యూస్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పథకాలను రూపొందించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి కోరారు. శనివారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇంత గొప్పగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం వారికి అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పూడిక తీయించి, కొత్త రిజర్వాయర్లు నిర్మించి రాష్ట్రంలో జల వనరులను పెంచి అందులో చేప పిల్లలను వదిలి తద్వారా మత్స్యకారు లకు ఉపాధిని కల్పించారని, వ్యాపారాల కోసం వాహనాలను కూడా అందిం చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కూర భాగ్యలక్ష్మి దేవరాజు, చొప్పదండి ప్రకాష్ మత్స్యకారుల పారిశ్రామిక సంఘం సభ్యులు, గంగపుత్ర సంఘాల సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భారీగా జరిమానాలు

• 196 మందికి రూ.6.30 లక్షల జరిమానా

వేములవాడ, వీవీన్యూస్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 196 మందికి కోర్టు రూ.6,30,000 జరిమానా విధించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. ఈ కేసులకు సంబంధించి శుక్రవారం వేములవాడ పోలీస్ స్టేషన్‌లో నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. విచారించిన మేజిస్ట్రేట్ మేఘన మొత్తం రూ.6.30 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి తమతో పాటు ఇతరుల కుటుంబాల్లోనూ విషాదం నింపవద్దని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్, రహవీర్ పథకాల గురించి వివరించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సహాయం అందించి, గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ట్రాఫిక్ ఆర్ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ సమావేశంలో వాగ్వాదం

• సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్ మధ్య తోపులాట

• ఇరువురిపై కేసు నమోదు

కోనరావుపేట, వీవీన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం సందర్భంగా వివాదం చోటుచేసుకుంది. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం జరుగుతున్న సమయంలో గ్రామ సర్పంచ్ భర్త షేక్ ఫిరోజ్ పాషా, ఉపసర్పంచ్ తిక్కల నవీన్ మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారి తీసింది. ఈ ఘటన అనంతరం ఇరువురూ కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు అందజేశారు. దీంతో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై బి. రామ్మోహన్ తెలిపారు. ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై వెల్లడించారు.



అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన రాజేష్ కుమార్ గౌడ్, మానస గౌడ్ దంపతుల నూతన గృహప్రవేశ వేడుకకు బీఆర్ఎస్ యువనాయకుడు టి. రామేశ్వర్ గౌడ్ హాజరయ్యారు. ఈ నందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

– సికింద్రాబాద్, వీవీన్యూస్



సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జల దోపిడీ

• చంద్రబాబుకు గురుదక్షిణగా మన నీళ్లను అప్పగిస్తున్నరు

• నాగార్జున సాగర్‌పై ఏపీ అక్రమ ప్రాజెక్టును వారం రోజుల్లోగా నిలిపి వేయించాలి

• లేదంటే వేలాది మందితో సాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తాం

• తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, వీవీన్యూస్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీకి పాల్పడుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం ఈ మేరకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజాభవన్ లో కాళ్లు కడిగి గురుదక్షిణగా మన నీళ్లను అప్పగించారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఆమోదంతోనే చంద్రబాబు పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టారని తెలిపారు. రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రొటోకాల్స్ ను విస్మరించి పని చేస్తున్నారని, ఫలితంగా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలవివాదాలపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేయకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో అన్ అఫీషియల్ మీటింగ్ కు వెళ్లి పోలవరం – బనకచర్లకు ఒప్పుకొని వచ్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి అడ్డుకోలేదనే ధైర్యంతోనే ఏపీ ప్రభుత్వం తాగు నీటి పేరుతో నాగార్జున సాగర్ నీళ్లకు గండికొడుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఎంతటి జలదోపిడీకి పాల్పడ్డాయో తెలంగాణ ప్రజల కళ్ల ముందర ఉందన్నారు. తాగునీరు పేరుతో శ్రీశైలం ప్రాజెక్టుపై పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించి ఇప్పుడు మొత్తం రిజర్వాయర్‌నే మళ్లించుకునే స్థాయిలో పనులు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు నాగార్జున సాగర్‌పై ఏపీ కన్ను పడిందని.. ఇప్పటికే తాగునీటి కోసం 2.8 టీఎంసీలను తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ లిఫ్ట్ పేరుతో మరో 1.8 టీఎంసీలను తరలించేందుకు రంగం సిద్ధం చేశారని అన్నారు. తాగునీటి పేరు చెప్పి ప్రాజెక్టులు మొదలు పెట్టి మొత్తం రిజర్వాయర్ లోని నీటిని ఎత్తుకుపోవడం ఏపీ నైజం అన్న సంగతి మనందరికి తెలుసన్నారు.

మహిళలు – రాజ్యాంగం సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

భారత రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకుంటేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న నిర్వహించనున్న మహిళలు – రాజ్యాంగం సదస్సు పోస్టర్ ను శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మహిళలకు ఎన్నో హక్కులను కల్పించిందని.. వాటిని సంపూర్ణంగా వినియోగించుకుంటే ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతామని తెలిపారు. 26న ఉదయం 10 గంటల నుంచి బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు, ఆ ఫలాలు ఎంతమేరకు అందుతున్నాయి.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన తరుణంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలు.. శ్రామికులు, గృహిణుల జీవన స్థితిగతులు సహా మహిళలకు సంబంధించిన అన్ని అంశాలపై సదస్సులో చర్చించి తీర్మానాలు చేస్తామని తెలిపారు. పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

డ్రగ్స్ మహమ్మారిని సమష్టిగా అరికట్టాలి

• యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి: జూటూరు కీర్తిరెడ్డి

• 'నషా ముక్త్ భారత్' ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు



హైదరాబాద్, వీవీన్యూస్: డ్రగ్స్ మహమ్మారిని అరికట్టి భావి భారతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు కుటుంబాలు, విద్యా సంస్థలు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమంలో శనివారం నిర్వహించిన 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా–హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. యువత దేశానికి విలువైన ఆస్తి అని, వారి శక్తిసామర్థ్యాలు దేశ ప్రగతికి ఉపయోగపడాలని అన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. యువతలో సామాజిక బాధ్యత, సరైన ఆలోచనా ధోరణి పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డ్రగ్స్ రహిత భారత నిర్మాణం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు నిర్వహించనున్న 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' ర్యాలీలో యువత, పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కదలాలి

• మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడటం అందరి బాధ్యత

• 'నషా ముక్త్ హైదరాబాద్' పాదయాత్రలో భాగస్వాములు కావాలి: దండుగుల శేఖర్

హైదరాబాద్, వీవీన్యూస్: యువత దేశానికి వెన్నుముక అని, వారిని మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఖైరతాబాద్ బీజేవైఎం కన్వీనర్ దండుగుల శేఖర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' ద్వారా దేశవ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలనకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 27 వరకు అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు నిర్వహించనున్న 'నషా ముక్త్ హైదరాబాద్' పాదయాత్రలో యువత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ కారణంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ సామాజిక ఉద్యమానికి మద్దతుగా నిలిచి, యువతలో చైతన్యం తీసుకురావాలని కోరారు.

మంత్రి ఓఎస్డీ పేరుతో టోకరా!

హైదరాబాద్, వీవీన్యూస్: మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీనంటూ నకిలీ గుర్తింపు కార్డు సృష్టించి, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొలుగూరి రవికిరణ్ అనే వ్యక్తి టీచర్, అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నలుగురు బాధితుల నుంచి రూ.50.87 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదు అందింది. ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టళ్లను సృష్టించి ఈ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రిన్సిపల్ సెక్రటరీ ఫిర్యాదు మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా వథకం అమలు తీరును కాంగ్రెస్ నేత, ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పీ.విజయారెడ్డి శనివారం పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతి, ప్రజలకు పథకం చేరుతున్న తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రోహిత్, సీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, వీవీన్యూస్



బీఆర్ఎస్‌లోకి యూత్ కాంగ్రెస్ నాయకులు

• అనుచరులతో కలిసి చేరిన మంత్రి శ్రీనాథ్, ప్రవీణ్

హైదరాబాద్, వీవీన్యూస్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలోకి పలువురు చేరారు. సోమాజిగూడ డివిజన్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు మంత్రి శ్రీనాథ్, ఖైరతాబాద్ డివిజన్‌కు చెందిన ప్రవీణ్ తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొత్తగా చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.



సాంస్కృతిక కార్యక్రమాలకే కాళోజీ కళాక్షేత్రం

- అక్కడ ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలకు అవకాశం కల్పించవద్దు
- కాళోజీ ఫౌండేషన్‌తో చర్చించి కార్యక్రమాలు ఖరారు చేయాలి
- కలెక్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, వీవీన్యూస్: హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తిస్థాయిలో సాహిత్య, సాంస్కృతిక, కళా కార్యక్రమాల నిర్వహణకే వినియోగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు వచ్చిన వార్త లపై స్పందించిన ఆయన.. అక్కడ ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలకు అవకాశం కల్పించ వద్దని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పా యీకు శనివారం ఆదేశాలు జారీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన సాహిత్య, సాంస్కృతిక, కళా కార్యక్రమాలపై కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రముఖ కవి కాళోజీ నారాయణ రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ క్షేత్రం ఆయన ఆశయాలకు అనుగుణంగా సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు

- క్రమశిక్షణ విషయంలో అందరికీ ఒకే నిబంధన
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ పరిశీలిస్తోంది
- సరైన సమయంలో అధిష్ఠానం నిర్ణయం: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



హైదరాబాద్, వీవీన్యూస్: సొంత పార్టీపై బహిరంగంగా విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానం నిశితంగా పరిశీలిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీ నిర్ణయాలకు, విధా నాలకు విరుద్ధంగా మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే విష యంలో ఏఐసీసీ తగిన నిర్ణయం తీ సుకుంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యమిస్తామని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని చెప్పారు. కాంగ్రెస్‌లో ప్రజా స్వామ్యం కొంత ఎక్కువగా ఉందని, అందుకే కొందరు నేతలు పార్టీ గీత దాటి మాట్లాడు తున్నారని వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ గమనిస్తోందని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రభుత్వ పనితీరు, స్థిరత్వంపై చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు ఈ విధంగా స్పందించారు. క్రమశిక్షణ ఉల్లంఘన విషయంలో అందరికీ ఒకే విధానం వర్తిస్తుందని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గతంలో మంత్రి కొండా సురేఖ విషయంలోనూ వెంటనే చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఆమె తీరు మారకపో వడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ నిబంధనలకు లోబడి పనిచేయాలని, ఎవరైనా హద్దులు దాటి వ్యవహరిస్తే సరైన సమయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, వీవీన్యూస్: ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై పలువురు కాంగ్రెస్ మహిళా నేతలు రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. చంపాపేటలో పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. మ హిళలు, దివ్యాంగులను పింఛన్లు తీసుకోకుండా అడ్డుకోవడంతో పాటు వారిని దుర్భాషలాడి తోసివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ మహిళా నేతలు సుజాత నాయక్, కంచర్ల కవిత, రజనీరావు తదితరులు ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఘటనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు మహిళా కమిషన్‌ను కోరారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- నల్గొండ వాసి దుర్మరణం.. వారంలో క్రితమే ఉద్యోగంలో చేరిక

హైదరాబాద్, వీవీన్యూస్: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి.. వారం రోజుల క్రితమే ఉద్యోగం సంపాదించిన తెలంగాణ యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. నల్గొండ జిల్లా మునుగోడుకు చెందిన ఈ సాయి తేజ (25) న్యూయార్క్‌లో శనివారం జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. చదువు పూర్తిచేసుకుని ఉద్యోగ జీవితాన్ని ప్రారంభిం చిన కొద్ది రోజులకే మృత్యువాత పడటంతో అతడి కుటుంబంలో విషాదం నెలకొంది. సాయి తేజ మృతిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అమెరికాలో ఉద్యోగం సంపాదించిన వారం రోజులకే అతడు ప్రాణాలు కోల్పోవడం

తెలంగాణతో 1ఎం1బీ ఫౌండేషన్ ఒప్పందం

- పెట్టుబడులు, ఆవిష్కరణలు, యువత నైపుణ్యాభివృద్ధికి అంతర్జాతీయ సహకారం
- విద్య, వైద్యం, ఏఐ, సుస్థిర పరిశ్రమల్లో ప్రపంచ సంస్థల భాగస్వామ్యం
- జెనీవాలో ఒప్పందం.. 1ఎం1బీ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, వీవీన్యూస్: తెలంగాణలో పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, యువత నైపుణ్యాభివృద్ధికి అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో నిర్వహించిన పదో 1ఎం1బీ ఇంపాక్ట్ సదస్సు సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, 1ఎం1బీ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు, పెట్టుబడిదారులు, భాగస్వాములను అనుసంధానించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఏఐ, పెట్టుబడులపై చర్చలు

1ఎం1బీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మానవ్ సుబోధ్ నిర్వహించిన 'ఇండియా–స్విట్జర్లాండ్ లీడర్‌షిప్ డైలాగ్'లో మంత్రి పాల్గొన్నారు. కృత్రిమ మేధ, పెట్టుబడులు, పర్యావరణహిత వ్యాపారాభివృద్ధి, నెట్‌జీరో లక్ష్యాలపై జరిగిన చర్చల్లో ఐరాస జెనీవా కార్యాలయ డైరెక్టర్ జనరల్ తత్యానా వలోవయాతో పాటు నెస్లే, ప్రపంచ ఆర్థిక వేదిక, సెర్న్, స్విస్ బయోటెక్ అసోసియేషన్ తదితర అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో సాంకేతిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, నైపుణ్యవంతమైన మానవ వనరులు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను శ్రీధర్‌బాబు వివరించారు. ఏఐ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, బయోటెక్నాలజీ, సుస్థిర పరిశ్రమలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత, భవిష్యత్ అవసరాలకు తగిన నైపుణ్యాల కల్పనపై చర్చించారు.

ప్రాజెక్టులకు అంతర్జాతీయ భాగస్వాములు

1ఎం1బీ ఆధ్వర్యంలోని గ్రీన్ స్కిల్స్, అప్లైడ్ ఏఐ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను శిక్షణ కేంద్రాలకే పరిమితం చేయకుండా అంతర్జాతీయ కంపెనీలు, విద్యాసంస్థలు, స్థానిక ప్రతిభావంతులను అనుసంధానించే వేదికలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. విద్య, వైద్యం, ఔషధ పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, ఏఐ, సుస్థిర అభివృద్ధి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులకు అంతర్జాతీయ కంపెనీలు, ఫౌండేషన్ల భాగస్వామ్యం కల్పించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాంకేతిక వేదికను అభివృద్ధి చేయడంతో పాటు భారత్, విదేశాల్లో పరిశ్రమల సమావేశాలు, ప్రాజెక్టుల ప్రదర్శనలు నిర్వహించనున్నారు.


యువతతో ముఖాముఖి

సదస్సులో భాగంగా 'అంతరాలను తగ్గించడం: యువత వాతావరణ దౌత్యం, సమాన అవకాశాలతో కూడిన ఏఐ' అనే అంశంపై జరిగిన చర్చలో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీకి చెందిన ఎలిజబెత్ సాండర్స్, మానవ్ సుబోధ్, యువ ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. భారత్, యూఏఈ, అమెరికా నుంచి 300 మందికి పైగా యువ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దౌత్యవేత్తలు, ఐరాస అధికారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులున్నారు.

మెటాపై దాడి హైదరాబాద్ బ్రాండ్‌కు దెబ్బ

- యూత్ కాంగ్రెస్ విధ్వంసంపై బీజేపీ, బీఆర్ఎస్ ఆగ్రహం
- కాంగ్రెస్ గూండాయిజాన్ని ప్రోత్సహిస్తోంది: రామచందర్‌రావు
- మెటా వంటి సంస్థనైనా తీసుకొచ్చారా: కేటీఆర్

హైదరాబాద్, వీవీన్యూస్: మెటా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తల విధ్వంసక చర్యలు అంతర్జాతీయంగా హైదరాబాద్‌కు ఉన్న ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా కృషి చేసి, వ్యాపార అనుకూల విధానాలతో నిర్మించుకున్న 'బ్రాండ్ హైదరాబాద్'కు ఇలాంటి ఘటనలు నష్టం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వేర్వేరుగా స్పందించారు.





గూండాయిజమే కాంగ్రెస్ సంస్కృతి

మెటా కార్యాలయంలోకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చొచ్చుకెళ్లిన ఘటనపై రామచందర్‌రావు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ సంస్కృతిలో గూండాయిజం అనేది అనుకోకుండా జరిగే పరిణామం కాదని, అదొక భాగమని విమర్శించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని పార్టీ మందలించాల్సింది పోయి ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. 1978లో ఇందిరాగాంధీ విడుదలను కోరుతూ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు విమానాన్ని హైజాక్ చేసిన ఘటనను ప్రస్తావించారు. ఆ తర్వాత వారికి లోక్‌సభ టికెట్లు ఇచ్చి ప్రోత్సహించారని పేర్కొన్నారు. 2026లో ఏఐ సదస్సు వేదికపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దుస్తులు లేకుండా నిరసన తెలిపి విధ్వంసానికి ప్రయత్నిస్తే.. రాహుల్‌గాంధీ వారిని 'బబ్బర్ షేర్' అంటూ ప్రశంసించారని విమర్శించారు.

దాడిని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటు

దశాబ్దాల కృషి, వ్యాపార అనుకూల విధానాలతో హైదరాబాద్ అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నగరం దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. మెటా కార్యాలయంపై దాడిని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో తెలంగాణకు మెటా వంటి ఒక్క అంతర్జాతీయ సంస్థనైనా తీసుకొచ్చిందా? అని ప్రశ్నించారు. కంపెనీలను భారత్‌కు తీసుకురావడానికి గూండాయిజమే మార్గమని రాహుల్ గాంధీ భావిస్తున్నారా అని నిలదీశారు. భారత్‌లోనే అతిపెద్ద క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు మెటా ముందుకొచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. సురక్షితమైన పని వాతావరణం కల్పిస్తామన్న భరోసాతోనే ఆ సంస్థ నగరాన్ని ఎంచుకుందని చెప్పారు. కార్యాలయంపై దాడి కేవలం ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, హైదరాబాద్‌పై అంతర్జాతీయ సంస్థలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే చర్య అని వ్యాఖ్యానించారు.

ఖాతాల నిలిపివేతపై నిరసన

యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్‌తో పాటు పలువురు నేతల సామాజిక మాధ్యమ ఖాతాలను మెటా నిలిపివేయడాన్ని నిరసిస్తూ నవంబరు 20న హైదరాబాద్ రాయదుర్గంలోని సంస్థ కార్యాలయ ప్రాంగణంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో పూలకుండీలను ధ్వంసం చేశారు. మెటా సంస్థ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఘటనలో శివచరణ్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు కాంగ్రెస్ నేత ఒకరు వెల్లడించారు.

శ్రీవారికి రూ.160కోట్ల బంగారు కానుక

- 121 కిలోల బంగారంతో 45 ఆభరణాల తయారీ
- ఈ నెల 26న టీటీడీకి భక్తుడి అందజేత
- తిరుమల చరిత్రలోనే అతిపెద్ద కానుక: టీటీడీ

తిరుమల, వీవీన్యూస్: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు భారీ కానుక సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా 121 కిలోల బంగారంతో తొమ్మిది సెట్లుగా 45 ఆభరణాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. వీటి విలువ సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.160 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. తిరుమల చరిత్రలో స్వామివారికి అందనున్న అతిపెద్ద కానుక ఇదేనని టీటీడీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే టీటీడీ అధికారులతో మాట్లాడిన సదరు భక్తుడు.. ఈ నెల 26న ఆభరణాలను టీటీడీకి అందజేయనున్నట్లు సమాచారం.

బీజేపీలోకి టీమిండియా క్రికెటర్ చాహల్

న్యూఢిల్లీ: భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ బీజేపీలో చేరారు. పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గ కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆయనకు చోటు కల్పించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టారు. అంతకుముందు చాహల్.. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అమర్‌పాల్ మౌర్యతో సమావేశమయ్యారు. మరోవైపు ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గంలో 37మందిని సభ్యులుగా, ఏడుగురిని ఉపాధ్యక్షులుగా, ముగ్గురిని ప్రధాన కార్యదర్శులుగా, మరో ఏడుగురిని కార్యదర్శులుగా బీజేపీ నియమించింది.



సినిమా పైరసీ ముఠా గుట్టురట్టు

హైదరాబాద్, వీవీన్యూస్: కొత్తగా విడుదలైన సినిమాలను థియేటర్లలోనే రహస్యంగా చిత్రీకరించి, పైరసీ వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో పంపిణీ చేస్తున్న ముఠా గుట్టును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) రట్టు చేసింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేసింది. షేక్ రిజ్వాన్ (19), రాంపోగు అజయ్ (19)లను నవంబరు 20న అదుపులోకి తీసుకున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. యాంటీ పైరసీ యూనిట్ (ఏపీయూ) నుంచి అందిన సమాచారంతో దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నట్లు తెలిపింది. దర్యాప్తులో భాగంగా నిందితులు కర్నూలులోని ఓ సినిమా థియేటర్‌లోకి వెళ్లి మొబైల్ ఫోన్లతో కొత్త సినిమాలను రహస్యంగా చిత్రీకరించినట్లు గుర్తించారు. అనంతరం ఆ వీడియోలను పైరసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి అక్రమంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడైంది. ఒక్కో సినిమాకు రూ.20వేల చొప్పున క్రిప్టోకరెన్సీ రూపంలో చెల్లింపులు అందుకున్నట్లు గుర్తించారు. ఆ మొత్తాన్ని భారత కరెన్సీలోకి మార్చుకున్నట్లు పేర్కొన్నారు. చిత్రీకరణకు ఉపయోగించిన మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బెట్టింగ్ యాప్‌ల ప్రచారంతోనూ..

తమ కార్యకలాపాలను గుర్తించకుండా ఉండేందుకు నిందితులు నకిలీ గుర్తింపులు, ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించుకున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలిపింది. పైరసీ వెబ్‌సైట్లలో ప్రకటనలు, లింకుల ద్వారా ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తూ అక్రమంగా ఆదాయం పొందుతున్నట్లు గుర్తించింది. ఈ ప్రచారానికి సంబంధించిన కమీషన్లను కూడా క్రిప్టోకరెన్సీ రూపంలో స్వీకరించినట్లు వెల్లడించింది. నిందితుల ఆర్థిక లావాదేవీలను గుర్తించడంతో పాటు ఈ నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో రామాయణ, మహాశక్తి, ఆకాశంలో ఒక తార, ఆదర్శ కుటుంబం సినిమాలను నిందితులు పైరసీ చేసినట్లు గుర్తించారు. కాపీరైట్ హక్కుదారుల అనుమతి లేకుండా సినిమాలను చిత్రీకరించి పంపిణీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

- థియేటర్లలో కొత్త సినిమాలను చిత్రీకరించి ఆన్‌లైన్‌లో విక్రయం
- కర్నూలుకు చెందిన ఇద్దరు విద్యార్థుల అరెస్టు • ఒక్కో సినిమాకు రూ.20వేల చెల్లింపు • క్రిప్టోకరెన్సీలో లావాదేవీలు ఆన్‌లైన్ గేమింగ్,
- బెట్టింగ్ యాప్‌ల ప్రచారంతోనూ అక్రమ ఆదాయం

గోల్ కొట్టేది మేమే!

- వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం • ఎన్నికల ఆట ఎలా ఆడాలో మాకు తెలుసు
- బీఆర్ఎస్, బీజేపీ కలిసి ఎన్ని రాజకీయ క్రీడలు ఆడినా ఫలితం ఉండదు
- రాష్ట్రంలో బీజేపీ నో మోర్.. 8 మంది ఎమ్మెల్యేలను కాపాడుకుంటేనే గొప్ప
- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూముల లెక్కలు త్వరలోనే అసెంబ్లీలో బయటపెడతాం
- మీడియా చిట్‌చాట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, వీవీన్యూస్: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఆట ఎలా ఆడాలో తమకు తెలుసని, విపక్షాలు ఎన్ని రాజకీయ క్రీడలు ఆడినా ఫలితం ఉండదని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ గోల్ కొట్టి అధికారంలోకి వస్తామని వ్యాఖ్యానించారు. బీజేపీ పని అయిపోయిందని, ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలను కాపాడుకుంటేనే గొప్ప అని ఎద్దేవా చేశారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన రాష్ట్ర రాజకీయాలు, కాళేశ్వరం ప్రాజెక్ట, భూభారతి పోర్టల్ తదితర అంశాలపై మాట్లాడారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూముల సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయిందని పొంగులేటి వెల్లడించారు. ఈ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అసెంబ్లీ వేదికగా ప్రజల ముందుంచుతామని తెలిపారు. సర్వే ప్రారంభమైన వెంటనే మాజీ మంత్రి హరీశ్‌రావు మామ తన భూముల విషయంలో కోర్టును ఆశ్రయించి ముందస్తు స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. భూభారతి (ధరణి) పోర్టల్‌లో ఉన్న సాంకేతిక సమస్యలు దాదాపు పరిష్కారమయ్యాయని చెప్పారు.

కాళేశ్వరం పేరుతో ప్రజాధనం వృథా

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని మంత్రి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తామని పేర్కొన్నప్పటికీ, అనుమతులు లేకుండా మూడు బ్యారేజీల్లో సికెంట్ పైల్స్ వాడారని విమర్శించారు. సికెంట్ పైల్స్ వినియోగం వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, డయాఫ్రమ్ వాల్ నిర్మించి ఉంటేనే అవి నిలబడేవని అన్నారు. డయాఫ్రమ్ వాల్‌కు బదులుగా సికెంట్ పైల్స్ ఎందుకు ఉపయోగించారో కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎప్పుడు పోరాటం చేయాలో అప్పుడే చేస్తాం

రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో తాను ఎంతో సౌకర్యంగా ఉన్నానని పొంగులేటి తెలిపారు. వచ్చే ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలో తమ ఐదుగురికి బాగా తెలుసని, ఎప్పుడు పోరాటం చేయాలో



అప్పుడే చేస్తామని అన్నారు. ఆ పోరాటంలో విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీకి ఇక భవిష్యత్తు లేదని, ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేలను కాపాడుకోవడమే ఆ పార్టీకి పెద్ద విషయమని పొంగులేటి విమర్శించారు.

ఎస్‌బీఐకి రోజుకు రూ.5వేల జరిమానా!

- రుణం తీర్చినా ఆస్తి పత్రాలు ఇవ్వడంలో ఏడేళ్ల జాప్యం
- బ్యాంకు సేవా లోపంగా తేల్చిన వినియోగదారుల కమిషన్
- న్యాయ ఖర్చులకు మరో రూ.10 వేలు చెల్లించాలని ఆదేశం

అలీగఢ్: గృహ రుణం పూర్తిగా చెల్లించినా అసలు ఆస్తి పత్రాలను తిరిగి ఇవ్వడంలో జాప్యం చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. పత్రాలు అప్పగించే వరకు రోజుకు రూ.5 వేల చొప్పున బాధితుడికి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. న్యాయ ఖర్చుల కింద మరో రూ.10 వేలు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన గుల్వీర్‌సింగ్ చౌహాన్ (70) 1997లో స్థానిక ఎస్‌బీఐ సిటీ బ్రాంచ్ నుంచి గృహ రుణం తీసుకున్నారు. ఆ సమయంలో తన ఆస్తికి సంబంధించిన అసలు విక్రయ దస్తావేజును బ్యాంకులో తనఖా పెట్టారు. 2019 మే నాటికి రుణాన్ని పూర్తిగా చెల్లించడంతో బ్యాంకు నో డ్యూ సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే, అసలు పత్రాలను మాత్రం తిరిగి ఇవ్వలేదు. అవి ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదంటూ బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు బాధితుడు ఆరోపించారు. ఆస్తి పత్రాలు లేకపోవడంతో ఇతర ఆస్తి వ్యవహారాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయని, మరో బ్యాంకు నుంచి రుణం పొందలేకపోయానని గుల్వీర్‌సింగ్ తెలిపారు. దీంతో 2023 జూన్‌లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ సందర్భంగా రుణం మంజూరు చేసి, అసలు దస్తావేజును తమ వద్ద ఉంచుకున్న విషయాన్ని ఎస్‌బీఐ అంగీకరించింది. 2020 ఫిబ్రవరిలో రుణ ఖాతా మూసివేసినట్లు బ్యాంకు జారీ చేసిన పత్రాన్నీ కమిషన్ పరిశీలించింది. బ్యాంకు తీరును సేవా లోపంగా పరిగణించిన కమిషన్.. అసలు ఆస్తి పత్రాలను బాధితుడికి తిరిగి అప్పగించాలని ఆదేశించింది. 2019 మే 13 నుంచి పత్రాలు అందజేసే వరకు రోజుకు రూ.5 వేల చొప్పున పరిహారం చెల్లించాలని పేర్కొంది. ఈ ఆదేశాలను అమలు చేసేందుకు 45 రోజుల గడువు ఇచ్చింది.

గంగానదిపై 'నీతీశ్ సేతు' ప్రారంభం

- 9.76 కి.మీ. పొడవైన వంతెన నిర్మాణానికి రూ.4,280 కోట్లు
- బిహార్‌లో రూ.34,470 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం
- 26,900 మందికి పైగా లబ్ధిదారులకు గృహప్రవేశాలు



పట్నా: బిహార్‌లో గంగానదిపై నిర్మించిన 'నీతీశ్ సేతు' వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. వైశాలీ జిల్లాలోని బిదుపూర్‌ను పట్నాలోని కచ్చీ దర్గాతో కలిపే ఈ వంతెనకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పేరు పెట్టారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 9.76 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన నిర్మాణానికి సుమారు రూ.4,280 కోట్లు ఖర్చు చేశారు. ఈ పర్యటనలో భాగంగా బిహార్‌లో మొత్తం రూ.34,470 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. రహదారులు, విద్యుత్తు, పట్టణ మౌలిక సదుపాయాలు, జలవనరులు, విద్య, వైద్యం, రవాణా రంగాలకు చెందిన పనులు వీటిలో ఉన్నాయి. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో ప్రధాని మోదీకి నీతీశ్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం వైశాలీలో నిర్వహించిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా 100 పీఎంఈ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 26,900 మందికిపైగా లబ్ధిదారులకు గృహప్రవేశాలు నిర్వహించినట్లు తెలిపారు.

దగ్గరి బంధువుల వివాహాలపై ప్రత్యేక చట్టం?

- కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు
- జన్యుపరమైన లోపాలు, పుట్టుకతో వచ్చే వైకల్యాల ముప్పుపై ఆందోళన
- వివాహానికి ముందు జన్యు పరీక్షలు, వైద్య సలహాలపై మార్గదర్శకాలు కోరిన పిటిషనర్



న్యూఢిల్లీ: దగ్గరి రక్తసంబంధీకుల మధ్య వివాహాలను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ వ్యవహారంపై తన అభిప్రాయాన్ని తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. అయితే చట్టం తీసుకురావాలని తాము ఆదేశించడం లేదని, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. ఇలాంటి వివాహాల నియంత్రణ పూర్తిగా శాసన వ్యవస్థ పరిధిలోని అంశమని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం బెంగళూరుకు చెందిన న్యాయ విద్యార్థిని చార్వి ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. దగ్గరి బంధువుల మధ్య వివాహాల వల్ల జన్యుపరమైన లోపాలు, పుట్టుకతో వచ్చే వైకల్యాలు, చూపు, వినికిడి సమస్యలు, ఎదుగుదల లోపాలు, శిశు మరణాల ముప్పు పెరిగే అవకాశం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు.

వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం లేకుండా..

వివాహం వ్యక్తిగత ఎంపికకు సంబంధించిన అంశమని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే అలాంటి నిర్ణయాల వల్ల ఎదురయ్యే ఆరోగ్యపరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో దగ్గరి బంధువుల మధ్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నా.. వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై తగిన అవగాహన ఉండటం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పాఠ్యాంశాల్లో ఈ అంశాలను చేర్చడంతోపాటు విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు.

వివాహానికి ముందే జన్యు పరీక్షలు

తాను కూడా దగ్గరి బంధువుల వివాహం వల్ల జన్మించానని, 40 శాతం చూపు వైకల్యంతో బాధపడుతున్నానని పిటిషనర్ తెలిపారు. హిందూ వివాహ చట్టం–1955లోని సెక్షన్ 5(4), 5(5) ప్రకారం నిషేధిత బంధుత్వ పరిధిలోని వ్యక్తులు కొన్ని సంప్రదాయాలు, ఆచారాల ఆధారంగా వివాహం చేసుకునేందుకు మినహాయింపులు ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి వివాహాలకు ముందు వైద్య సలహాలు, జన్యు పరీక్షలు, ఆరోగ్యపరమైన ముప్పుపై అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైన మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జరిగిన వివాహాలను నేరంగా పరిగణించడం లేదా వాటి చట్టబద్ధతను ప్రశ్నించడం తమ ఉద్దేశం కాదని పిటిషనర్ స్పష్టం చేశారు. పిల్లల ఆరోగ్యం, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా హిందూ వివాహ చట్టానికి సవరణలు చేయడం లేదా సమగ్ర చట్టం తీసుకురావడం వంటి అంశాలను పరిశీలించాలని కోరారు.

విడుదలైన తొలిరోజే రూ.33వేల కోట్లు!

- రికార్డులు బద్దలుకొట్టిన 'గ్రాండ్ తెఫ్ట్ ఆటో–6'
- ప్రపంచ వినోద రంగ చరిత్రలోనే అతిపెద్ద విడుదల
- విడుదలకు ముందే 3.25 కోట్ల గేమ్‌ల విక్రయం
- మెటాక్రిటిక్‌లో 99 స్కోరు.. భారత్‌లో రూ.5,999 నుంచి ధరలు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా వీడియో గేమింగ్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'గ్రాండ్ తెఫ్ట్ ఆటో–6' (జీటీఏ–6) విడుదలైన తొలిరోజే రికార్డులు సృష్టించింది. తొలి రోజు రిటైల్ అమ్మకాల ద్వారా 3.79 బిలియన్ డాలర్లు (సుమారు రూ.33 వేల కోట్లు) ఆర్జించింది. ప్రపంచ వినోద రంగ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన విడుదలగా నిలిచిందని ఈ గేమ్‌ను రూపొందించిన రాక్‌స్టార్ గేమ్స్ ప్రకటించింది. విడుదలకు ముందే అన్ని ప్లాట్‌ఫామ్‌లలో కలిపి 3.25 కోట్ల యూనిట్లు అమ్ముడై మరో రికార్డు సృష్టించినట్లు వెల్లడించింది. జీటీఏ–6కు ప్రముఖ సమీక్షల వెబ్‌సైట్ మెటాక్రిటిక్‌లో 100కు 99 స్కోరు లభించింది. వృత్తిపరమైన సమీక్షకుల అభిప్రాయాలను క్రోడీకరించి ఈ స్కోరును కేటాయిస్తారు. ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోందని రాక్‌స్టార్ గేమ్స్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు సామ్ హౌసర్ తెలిపారు. ఈ విజయాన్ని ఆటగాళ్లతో కలిసి పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్లేస్టేషన్ స్టోర్, మైక్రోసాఫ్ట్ స్టోర్, రాక్‌స్టార్ గేమ్స్ స్టోర్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా రిటైల్ విక్రయ కేంద్రాల్లోనూ ఈ గేమ్ అందుబాటులో ఉంది.



13 ఏళ్ల నిరీక్షణకు తెర

జీటీఏ సిరీస్‌లో గత భాగం విడుదలైన 13 ఏళ్ల తర్వాత తాజా వెర్షన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ఈ ఏడాది అత్యంత భారీ గేమింగ్ విడుదలల్లో ఒకటిగా దీనిని అభివర్ణిస్తున్నారు. అమెరికాలోనూ ఈ గేమ్ విడుదల సందడి ఉద్యోగ రంగానికి విస్తరించింది. విడుదల రోజున సెలవు తీసుకోవాలని దాదాపు ఐదుగురిలో ఒకరు వేతన ఉద్యోగి భావించినట్లు ఓ సర్వే వెల్లడించింది. అభిమానులు గేమింగ్ కోసం సమావేశాలు, ఇతర పనులను సైతం వాయిదా వేసుకున్నారు.

వైస్ సిటీ నేపథ్యంలో కథ

అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం స్ఫూర్తితో రూపొందించిన కల్పిత ప్రాంతం లియోనిడాలో జీటీఏ–6 కథ సాగుతుంది. జేసన్, లూసియా అనే ప్రధాన పాత్రలు ఓ సులభమైన దోపిడీ ప్రయత్నం విఫలమవడంతో కుట్రలో చిక్కుకుంటారు. వైస్ సిటీ నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో విస్తృతమైన వర్చువల్ ప్రపంచాన్ని రూపొందించారు. భారత్‌లో ప్లేస్టేషన్, మైక్రోసాఫ్ట్ స్టోర్లలో జీటీఏ–6 స్టాండర్డ్ ఎడిషన్ ధర రూ.5,999గా నిర్ణయించారు. అల్టిమేట్ ఎడిషన్ ధర రూ.7,499. ఇందులో అదనపు వాహనాలు, ఆయుధాలు, దుస్తులు, ప్రత్యేక గేమింగ్ సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

గాంధీ జ్ఞాపకాలకు చెరపెట్టొద్దు

- పాట్నాలోని 120ఏళ్ల చారిత్రక ఆసుపత్రి భవనం కూల్చివేతకు రంగం సిద్ధం
- కాపాడాలంటూ కేంద్ర సాంస్కృతిక శాఖకు గాంధీ సంగ్రహాలయం లేఖ

న్యూఢిల్లీ/పాట్నా: అభివృద్ధి పేరుతో చారిత్రక కట్టడాలను కూల్చివేయడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బిహార్ రాజధాని పాట్నాలోని 120 ఏళ్ల నాటి బాంకీపూర్ జనరల్ ఆసుపత్రి భవనంలోని ముందు భాగాన్ని కూల్చివేయకుండా కాపాడాలని పాట్నాలోని గాంధీ సంగ్రహాలయం కేంద్ర సాంస్కృతిక శాఖను కోరింది. మహాత్మాగాంధీ 1947 మేలో సందర్శించిన ఈ భవనానికి చారిత్రక ప్రాధాన్యం ఉందని, తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సంగ్రహాలయం కార్యదర్శి, 87 ఏళ్ల గాంధేయవాది రజీ అహ్మద్ ఈ మేరకు నవంబరు 19న లేఖ రాశారు. ప్రస్తుతం పాట్నా మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (పీఎంసీహెచ్) ప్రాంగణంలో ఉన్న ఈ భవనం.. అప్పట్లో బాంకీపూర్ జనరల్ ఆసుపత్రిగా ప్రసిద్ధి చెందింది. 1947 మే 15న కోల్‌కతా నుంచి పాట్నా చేరుకున్న గాంధీజీ.. తన మనవరాలు మనూ గాంధీకి అపెండిసైటిస్ శస్త్రచికిత్స జరిగే సమయంలో ఆసుపత్రిలోనే ఉన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్స పూర్తయ్యే వరకు ఆమెకు తోడుగా ఉన్నారు. ఈ ఘటనను గాంధీజీ తన డైరీలోనూ ప్రస్తావించారు. ఆసుపత్రి అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఈ చారిత్రక సందర్భం నమోదైంది. అరుదైన ఆపరేషన్ ఫొటోలు ఇప్పటికీ పాత చిత్రాల భాండాగారాల్లో భద్రంగా ఉన్నాయి.

ఇప్పటికే పలు కట్టడాల కూల్చివేత

పీఎంసీహెచ్ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే పలు పాత భవనాలను కూల్చివేశారు. ఉత్తర, దక్షిణ భాగాల్లో ఉన్న చారిత్రక హత్వా, గుజ్రీ వార్డులను గత రెండు నెలల్లో తొలగించారు. వాటి మధ్య ఉన్న పాత మెట్ల మార్గం, బ్రిటిష్ కాలం నాటి లిఫ్టు, ప్రధాన భవనానికి అనుసంధానంగా ఉన్న వంతెనను సైతం కూల్చేశారు. ప్రస్తుతం రెండు అంతస్తుల డోరిక్ స్తంభాలతో ప్రత్యేక నిర్మాణశైలిని కలిగిన ప్రధాన భవనం ముందు భాగం కూడా కూల్చివేత ముప్పును ఎదుర్కొంటోంది.

అభివృద్ధితో పాటు వారసత్వ పరిరక్షణ?

2021 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఈ పునరాభివృద్ధి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పాత నిర్మాణాల తొలగింపు కొనసాగుతోంది. మహిళా ఆసుపత్రి భవనంలోని కొంతభాగాన్ని కూడా తొలగించి, అశోక్ రాజ్‌పథ్‌పై దాదాపు రెండు కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి అవకాశం కల్పించారు. ఈ కూల్చివేతలపై చరిత్రకారులు, వారసత్వ పరిరక్షణ సంస్థలు, పీఎంసీహెచ్ పూర్వ విద్యార్థుల సంఘం ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. భారత జాతీయ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) కూడా భవనాలను కాపాడాలని కోరుతోంది.

గాంధీ పేరు పెట్టి స్మారకంగా మార్చాలి

పుణెలోని సాసూన్ జనరల్ ఆసుపత్రిలో 1924లో గాంధీజీకి అపెండిసైటిస్ శస్త్రచికిత్స జరిగిన ప్రాంతాన్ని స్మారకంగా పరిరక్షిస్తున్నారని గాంధీ సంగ్రహాలయం గుర్తుచేసింది. అదే తరహాలో బాంకీపూర్ ఆసుపత్రి మిగిలిన భవనాన్ని కూడా కాపాడి, గాంధీజీ లేదా మనూ గాంధీ పేరు పెట్టాలని సూచించింది. అభివృద్ధి చెందిన భారత్, స్మార్ట్ సిటీ నిర్మాణం పేరుతో గాంధీజీకి అనుబంధమున్న చారిత్రక కట్టడాలను ధ్వంసం చేయడం సమంజసం కాదని లేఖలో ఆవేదన వ్యక్తం చేసింది.




మాస్ స్టెప్పులతో అదరగొట్టిన మహానటి

నటనకు ప్రాధాన్యమిచ్చే పాత్రలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న కీర్తి సురేశ్.. ఇప్పుడు గ్లామర్ విషయంలోనూ కొత్త అడుగులు వేస్తున్నారా? దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న తాజా చిత్రంలోని పాట చూస్తుంటే ఇదే అనిపిస్తోందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటివరకు తెరపై అందాల ప్రదర్శనకు దూరంగా ఉంటూ వచ్చిన ఆమె.. తాజాగా విడుదలైన 'డివికి డివికి' పాటలో భిన్నమైన లుక్‌తో కనిపించి అందరి దృష్టినీ ఆకర్షించారు. 'జనవరి 12' పేరుతో అనిల్ రావిపూడి ప్రారంభించిన మ్యూజికల్ ప్రమోషన్లలో భాగంగా ఈ పాటను విడుదల చేశారు. ఇందులో కీర్తి సురేశ్, కృతి శెట్టి మాస్ స్టెప్పులతో నందడి చేశారు. ఇద్దరి డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా.. కీర్తి కనిపించిన గ్లామరస్ లుక్ ప్రత్యేక చర్చకు దారితీసింది. ఇప్పటివరకు తన సినిమాల్లో గ్లామర్ విషయంలో హద్దులు పాటించిన ఆమె.. ఈ పాటలో మాత్రం తన పంథాకు భిన్నంగా కనిపించారు. దీంతో కీర్తి అభిమానులు, నెటిజన్లు ఆమె కొత్త లుక్‌పై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. ముఖ్యంగా కృతి శెట్టితో పోలుస్తూ.. వయసులో పెద్దదైనా కీర్తి మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నారంటూ కామెంట్లు చేస్తున్నారు. పెళ్లి తర్వాత ఆమె తన తెరపై కనిపించే తీరును మార్చుకున్నారా? అనిల్ రావిపూడి పాత్రకు తగ్గట్టుగా ఈ కొత్త లుక్‌ను ఎంచుకున్నారా? అనే చర్చ కూడా సాగుతోంది.



డిసెంబరు 4న చైతూ 'వృషకర్మ'

అక్కినేని నాగచైతన్య నటిస్తున్న భారీ మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ' విడుదల తేదీపై వస్తున్న వాయిదా వార్తలకు చిత్ర బృందం ప్రచార షెడ్యూల్ ద్వారా సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ముందుగా ప్రకటించిన డిసెంబరు 4నే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. నవంబరు 25న ట్రైలర్ విడుదల చేసి, అదే రోజు నుంచి డిసెంబరు 4 వరకు వరుసగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాగచైతన్య వర్గాల సమాచారం. డిసెంబరు 3 రాత్రి విదేశాల్లో ప్రీమియర్ షోలు, డిసెంబరు 4 తెల్లవారుజాము నుంచే దేశీయంగా ప్రదర్శనలు ప్రారంభం కానున్నట్లు ఓ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



ది ఇండియన్ బార్డర్ ఫస్ట్‌లుక్ విడుదల

సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం సైనికులు చేసే త్యాగాలు, వారి కుటుంబాలు ఎదుర్కొనే భావోద్వేగ సంఘర్షణలను వెండితెరపై ఆవిష్కరించేందుకు 'ది ఇండియన్ బార్డర్' సిద్ధమవుతోంది. భారత్–పాకిస్థాన్ సరిహద్దు నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడే సైనికుల తెగువతోపాటు.. వారి కోసం ఎదురు చూసే కుటుంబ సభ్యుల మనోధైర్యం, ఆవేదనను ఇందులో చూపించనున్నారు. కిరణ్ యార్లగడ్డ కథ అందించడంతో పాటు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి డి.ఎస్. బాషా దర్శకత్వం వహిస్తున్నారు.



బిజినెస్ BUSINESS

చిన్న వ్యాపారాలకు రుణాలిస్తేనే ప్రయోజనం

- పెద్ద సంస్థలకు భారీ రుణాల కంటే చిన్న వ్యాపారాలకు ప్రాధాన్యమివ్వాలి
- రూ.వెయ్యి కోట్లను సూక్ష్మ సంస్థలకు పంపిణీ చేస్తే ప్రయోజనం వెయ్యి రెట్లు
- 20–40 శాతం రాబడుల ఆశ చూపే పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచన



ముంబై: పెద్ద వ్యాపార సంస్థలకు భారీ మొత్తంలో రుణాలు ఇవ్వడం కంటే సూక్ష్మ, చిన్న వ్యాపారాలకు రుణాలు అందించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. బ్యాంకులు చిన్న వ్యాపారాలకు రుణాలివ్వడంపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. ఒక పెద్ద సంస్థకు రూ.వెయ్యి కోట్ల రుణం ఇస్తే ఒక సంస్థకే ప్రయోజనం కలుగుతుందని, అదే మొత్తాన్ని చిన్న సంస్థలకు పంపిణీ చేస్తే కనీసం వంద రెట్లు ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. సూక్ష్మ సంస్థలకు ఆ మొత్తాన్ని అందిస్తే ప్రయోజనం వెయ్యి రెట్లు పెరుగుతుందని పేర్కొన్నారు. పుణె జిల్లా వక్సాయ్ గ్రామంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శనివారం నిర్వహించిన ఆర్థిక సమ్మిళిత శిబిరంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు బ్యాంకులు అందిస్తున్న సేవల వల్ల విస్తృత ప్రజానీకానికి మేలు జరుగుతోందని మల్హోత్రా తెలిపారు. అందుకే చిన్న వ్యాపారాలకు రుణాలు అందించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని బ్యాంకులకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 60 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవడం ద్వారా గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. ఇకపై ఆర్థిక అక్షరాస్యతతోపాటు డిజిటల్ పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

అధిక రాబడుల ఆశకు మోసపోవద్దు

డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ గవర్నర్ సూచించారు. తక్కువ వ్యవధిలోనే 20, 30, 40 శాతం రాబడులు ఇస్తామంటూ ఎవరైనా ఆశ చూపితే జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇలాంటి అసాధారణ లాభాల వెనుక అధిక నష్టాలు లేదా మోసపూరిత పథకాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీని ఇతరులకు చెప్పవద్దని, గుర్తుతెలియని లింకులపై క్లిక్ చేయడం, అనుమానాస్పద సందేశాలకు స్పందించడం వంటివి చేయరాదన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని, అయితే పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

డిసెంబరు 31 వరకు శిబిరాలు

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నిర్వహించిన ఈ శిబిరానికి 500 మందికి పైగా హాజరయ్యారు. ప్రజలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలను చేరువ చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. దేశ వ్యాప్తంగా డిసెంబరు 31 వరకు ఇలాంటి శిబిరాలు నిర్వహించనున్నట్లు మల్హోత్రా తెలిపారు. కేంద్ర ఆర్థిక సేవల విభాగం చేపట్టిన ఆర్థిక సమ్మిళిత సంతృప్తి ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ నిధు సక్సేనా మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం 3 వేలుగా ఉన్న తమ బ్యాంకు వ్యాపార ప్రతినిధుల నెట్‌వర్క్‌ను 10 వేలకు విస్తరించినట్లు తెలిపారు. తమ బ్యాంకు స్పాన్సర్ చేస్తున్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు నిర్వహించిన శిబిరాలతో కలిపి ఇప్పటివరకు 3,691 శిబిరాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

ఇండస్‌ఇండ్ మాజీ సీఈఓపై వేటు

- బ్యాంకు లెక్కల్లో రూ.1,979 కోట్ల లోపాలు
- తక్షణమే సేవలను రద్దు చేస్తున్నట్లు ప్రకటన

న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంకు మాజీ ఎండీ, సీఈఓ సుమంత్ కథ్‌పాలియాపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంది. ఆయన సేవలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు వెల్లడించింది. నవంబరు 20న జరిగిన బోర్డు సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు నియంత్రణ సంస్థలకు సమాచారం ఇచ్చింది. కథ్‌పాలియాకు 2020 మార్చి 24 నుంచి మాలస్, క్లాబ్యాక్ నిబంధనలను వర్తింపజేయాలని బోర్డు నిర్ణయించింది. దీంతో గతంలో చెల్లించిన ప్రోత్సాహకాలు, ఇతర వేతన ప్రయోజనాల్లో కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. బ్యాంకు డెరివేటివ్స్ విభాగంలో లెక్కల అవకతవకలు 2025 మార్చిలో వెలుగుచూశాయి. వీటిపై విచారణ జరిపిన పీడబ్ల్యూసీ సంస్థ.. 2024 జూన్ 30 నాటికి బ్యాంకుపై రూ.1,979 కోట్ల ప్రతికూల ప్రభావం ఉన్నట్లు అంచనా వేసింది. డెరివేటివ్స్, సూక్ష్మరుణాలు, బ్యాలెన్స్‌షీట్ వ్యవహారాల్లో అవకతవకలపై అనుమానాలు వ్యక్తం చేసిన బ్యాంకు బోర్డు.. ఈ అంశాలను దర్యాప్తు, నియంత్రణ సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించింది. కథ్‌పాలియా 2025 ఏప్రిల్ 29న ఎండీ, సీఈఓ పదవికి రాజీనామా చేశారు. అదే రోజు డిప్యూటీ సీఈఓ అరుణ్ ఖురానా కూడా వైదొలిగారు. అనంతరం కథ్‌పాలియాపై అంతర్గత క్రమశిక్షణ విచారణ ప్రారంభించిన బ్యాంకు.. జూన్ 18 నుంచి ఆయనను సస్పెండ్ చేసింది. తాజాగా విచారణ నివేదిక ఆధారంగా సేవల రద్దు నిర్ణయం తీసుకుంది.

హీరో ఫిన్‌కార్ప్ రుణాల పంపిణీ రెట్టింపు

- రానున్న రెండు త్రైమాసికాల్లో వృద్ధిపై దృష్టి

న్యూఢిల్లీ: రానున్న రెండు త్రైమాసికాల్లో రుణాల పంపిణీని రెట్టింపు చేయాలని హీరో ఫిన్‌కార్ప్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు ఉత్తర భారతదేశంలోని ఏడు రాష్ట్రాల్లో 4.80 లక్షలకుపైగా రుణాలు అందించినట్లు సంస్థ వెల్లడించింది. ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్‌కు చెందిన ఆర్థిక సేవల విభాగమే హీరో ఫిన్‌కార్ప్. ద్విచక్ర వాహనాలు, కార్ల కొనుగోలు రుణాలతోపాటు వ్యక్తిగత రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణాలు, వ్యాపార నిర్వహణ మూలధనం, ఆస్తులపై రుణాలను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. విస్తృత రుణ సేవలు, పంపిణీ నెట్‌వర్క్, ఏఐ ఆధారిత రుణ అర్హత పరిశీలన తమ వృద్ధికి దోహదపడతాయని పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు రాష్ట్రాల్లో 4.80 లక్షలకుపైగా కుటుంబాలు, వ్యాపార సంస్థలు తమ సేవలను వినియోగించుకున్నాయని సంస్థ ప్రతినిధి తెలిపారు. రానున్న రెండు త్రైమాసికాల్లో ఈ ప్రాంతంలో వృద్ధిని రెట్టింపు చేయడమే లక్ష్యమని, వినియోగదారుల విశ్వాసానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

పోఖ్రాన్‌లో అదానీ క్షిపణి పరీక్షలు సక్సెస్

- 'బఖ్‌రా ఏటీ1'తో నాలుగు ట్యాంకు విధ్వంసక క్షిపణుల ప్రయోగం
- 8 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం

న్యూఢిల్లీ: భారత రక్షణ రంగంలో మరో కీలక అస్త్రం సిద్ధమైంది. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన 'బఖ్‌రా ఏటీ1' ట్యాంకు విధ్వంసక క్షిపణి వ్యవస్థ పరీక్షలు విజయవంతమయ్యాయి. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో నవంబరు 20న నాలుగు క్షిపణులను ప్రయోగించినట్లు సంస్థ వెల్లడించింది. సైన్యం, రక్షణ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యవస్థ 8 కిలోమీటర్ల దూరంలోని సాయుధ వాహనాలను ధ్వంసం చేయగలదు. లేజర్ మార్గదర్శక సాంకేతికతతో పనిచేయడంతో శత్రువుల ఎలక్ట్రానిక్ జామింగ్ ప్రభావాన్ని ఎదుర్కోగలదు. పగలు, రాత్రి వేళల్లోనూ లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంది.

ఒక వాహనంపై 12 క్షిపణులు

ఒకే లేజర్ మార్గంలో రెండు క్షిపణులను వరుసగా ప్రయోగించడం దీని ప్రత్యేకత. మొదటిది శత్రు ట్యాంకు క్రియాశీల రక్షణ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. రెండోది దాని కవచాన్ని ఛేదిస్తుంది. ప్రత్యేక 4X4 సాయుధ వాహనంపై అమర్చిన ఈ వ్యవస్థలో నాలుగు క్షిపణులు ప్రయోగానికి సిద్ధంగా ఉండగా, మరో ఎనిమిది నిల్వ చేసుకోవచ్చు. సురక్షిత ప్రాంతం నుంచే ప్రయోగాలు నిర్వహించి వెంటనే వాహనాన్ని మరోచోటుకు తరలించవచ్చు. భారత భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, సైనిక అవసరాలకు అనుగుణంగా దీనిని అభివృద్ధి చేసినట్లు అదానీ సంస్థ తెలిపింది.



నేచురెల్ ఇండియా రద్దు పిటిషన్‌పై ముగిసిన విచారణ

- మరిన్ని వివరాలు, ఆధార పత్రాలు సమర్పించాలని ఎన్‌సీఎల్‌టీ ఆదేశం



న్యూఢిల్లీ: జైడస్ వెల్‌నెస్ గతంలో అనుబంధ సంస్థగా ఉన్న నేచురెల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రద్దుకు సంబంధించిన పిటిషన్‌పై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) విచారణను ముగించింది. అయితే, మరింత వివరణతోపాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పించాలని సూచించింది. ఈ మేరకు అహ్మదాబాద్ ఎన్‌సీఎల్‌టీ బెంచ్ నవంబరు 18న ఇచ్చిన ఉత్తర్వులు 19న అందినట్లు జైడస్ వెల్‌నెస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. తాజా ఉత్తర్వులతో నేచురెల్ ఇండియా లేదా దాని లిక్విడేటర్ మరోసారి రద్దు పిటిషన్ దాఖలు చేసుకునే అవకాశం ఉంటుందని ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. దీంతో అవసరమైన వివరణలు, ఆధార పత్రాలతో లిక్విడేటర్ కొత్త దరఖాస్తు సమర్పించనున్నట్లు జైడస్ వెల్‌నెస్ తెలిపింది. దివాలా, పరిష్కార ప్రక్రియ కోడ్–2016 కింద సంస్థ రద్దు కోసం లిక్విడేటర్ 2026 మార్చి 25న తొలిసారి పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు జైడస్ వెల్‌నెస్, నేచురెల్ ఇండియా బోర్డులు స్వచ్ఛంద లిక్విడేషన్‌కు ఆమోదం తెలిపాయి.

హాంకాంగ్ ఓపెన్‌లో
భారత షట్లర్లకు నిరాశ

- సాత్విక్–చిరాగ్ జోడీకి సెమీస్‌లో ఓటమి
- లక్ష్యసేన్ కూడా వెనుదిరగడంతో ముగిసిన భారత్ పోరాటం

కౌలూన్: హాంకాంగ్ ఓపెన్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్ల పోరాటం సెమీఫైనల్ దశలోనే ముగిసింది. పురుషుల డబుల్స్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జోడీ, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ తమ తమ సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో ఓటమిపాలయ్యారు. దీంతో టోర్నీలో భారత ప్రాతినిధ్యం ముగిసింది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 18–21, 19–21తో మలేసియాకు చెందిన ఎనిమిదో సీడ్ జోడీ మాన్ వీ చోంగ్–టీ కై వున్ చేతిలో ఓడింది. ఆరంభంలో 3–0తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత జోడీ.. ఆ తర్వాత ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదుర్కొంది. ఇరు జట్లూ వేగంగా షాట్లు ఆడుతూ పాయింట్ల కోసం పోటీపడ్డాయి. తొలి గేమ్‌లో 18–19తో వెనుకబడిన దశలో సాత్విక్ గంటకు 428 కిలోమీటర్ల వేగంతో కొట్టిన స్మాష్‌తో స్కోరును దగ్గర చేసినా.. మలేసియా జోడీ గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో భారత జంట 7–3తో ఆధిక్యం సాధించింది. అయితే మాన్, టీ కై వున్ వరుసగా ఆరు పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి వచ్చారు. ఆ తర్వాత 9–14తో వెనుకబడిన సాత్విక్–చిరాగ్ పుంజుకుని 19–19తో స్కోరు సమం చేశారు. కానీ చివరి రెండు పాయింట్లను మలేసియా జోడీ గెలుచుకుని ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. ఈ ఏడాది సింగపూర్, చైనా ఓపెన్ టైటిళ్లు గెలిచిన సాత్విక్–చిరాగ్‌కు ఈ ఓటమి నిరాశ కలిగించింది.

ఆంటోన్సెన్ ధాటికి లక్ష్యసేన్ విలవిల

పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో లక్ష్యసేన్ 13–21, 13–21తో డెన్మార్క్ ఆటగాడు ఆండర్స్ ఆంటోన్సెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన ఆంటోన్సెన్.. లక్ష్యకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. తొలి గేమ్‌లో 8–8తో సమంగా ఉన్న సమయంలో వరుస పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి వెళ్లాడు. రెండో గేమ్‌లోనూ లక్ష్య కదలికలు నెమ్మదించడంతో ప్రత్యర్థి సులువుగా పాయింట్లు సాధించాడు. ఇదిలాఉంటే గత రెండు వారాల్లో హైలో ఓపెన్, జపాన్‌లోని కుమామోటో మాస్టర్స్ టైటిళ్లు గెలిచిన లక్ష్యసేన్.. హాంకాంగ్‌లో ఓటమితో తన వరుస విజయాలకు ముగింపు పలికాడు. వరుస టోర్నీల్లో ఆడటంతో రెండు కాళ్లలోనూ అలసట ఏర్పడిందని లక్ష్య తెలిపాడు. ఆంటోన్సెన్‌తో వేగంగా ఆడటం తనకు కష్టమైందని, కోర్టులో నియంత్రణ, ఆటతీరులో ప్రత్యర్థి మెరుగ్గా ఉన్నాడని పేర్కొన్నాడు. అలసట కారణంగా గాయాలయ్యే ప్రమాదం ఉండటంతో కొన్ని షాట్లకు పూర్తిస్థాయిలో ప్రయత్నించలేదని వివరించాడు. అయితే గత కొన్ని టోర్నీల్లో తన ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నానని లక్ష్య చెప్పాడు. తొలి టైటిల్ గెలిచిన తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగిందని, కోలుకుని మళ్లీ బరిలోకి దిగాలనే ఉత్సాహం కలిగిందని తెలిపాడు.

నిఖిల్ చౌదరి మెరుపులు

- ఇంగ్లండ్‌పై ఆసీస్ మూడు వికెట్ల తేడాతో విజయం

మెల్‌బోర్న్: భారత సంతతి క్రికెటర్ నిఖిల్ చౌదరి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆస్ట్రేలియా జట్టు ఇంగ్లండ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. శనివారం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన తొలి టీ20లో మూడు వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత లెగ్‌స్పిన్‌తో రెండు వికెట్లు తీసిన నిఖిల్.. అనంతరం బ్యాటింగ్‌లోనూ సత్తాచాటాడు. 38 బంతుల్లో 66 పరుగులు చేసి ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇక్కడ ఛేదించిన 188 పరుగుల లక్ష్యం మెల్‌బోర్న్ మైదానంలో టీ20ల్లో రికార్డు కావడం విశేషం. 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఒక దశలో విజయం దిశగా సాగింది. అయితే 20 పరుగులు చేయాల్సి ఉండగా చివరి రెండు ఓవర్లకు ముందు నిఖిల్ ఔటయ్యాడు. దీంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్లో 11 పరుగులు అవసరమయ్యాయి. ఇంగ్లండ్ బౌలర్ సామ్ కరన్ ఆ పరుగులను కట్టడి చేసేందుకు ప్రయత్నించినా.. జాక్ ఎడ్వర్డ్స్ చివరి ఓవర్‌లో రెండో బంతి మిగిలి ఉండగానే విజయాన్ని ఖరారు చేశాడు. ఆస్ట్రేలియా 7 వికెట్లకు 191 పరుగులు చేసింది. ఆరు సంవత్సరాల క్రితం పర్యాటక వీసాపై ఆస్ట్రేలియాకు వచ్చిన నిఖిల్.. కొవిడ్ ప్రయాణ ఆంక్షల కారణంగా అక్కడే ఉండిపోయాడు. తాజాగా స్వదేశంలో అరంగేట్రం చేసిన అతడు తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టాడు. భారత్ నుంచి తన తల్లిదండ్రులు మ్యాచ్ చూసేందుకు ముందు రోజు రాత్రే వచ్చారని, వారి సమక్షంలోనే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నాడు.





పరుగుల వరద

- రాహుల్ సెంచరీ.. రెండు పరుగుల దూరంలో సెంచరీ చేజార్చుకున్న గిల్
- అర్ధశతకాలతో మెరిసిన పంత్, పడిక్కల్
- తొలి టెస్టులో టీమిండియాకు 118 పరుగుల ఆధిక్యం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (136; 290 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్) అద్భుత శతకంతో జట్టును ఆదుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (98; 146 బంతుల్లో) రెండు పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 486 పరుగులు చేసింది. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుపై ఇప్పటికే 118 పరుగుల ఆధిక్యం సాధించింది. రిషభ్ పంత్ (55; 62 బంతుల్లో) క్రీజులో ఉన్నాడు. ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆట కొనసాగించిన భారత్‌కు రాహుల్, దేవదత్ పడిక్కల్ (80; 175 బంతుల్లో) అండగా నిలిచారు. రెండో వికెట్‌కు 165 పరుగులు జోడించారు. నిలకడగా ఆడిన రాహుల్ కెరీర్‌లో 13వ టెస్టు శతకాన్ని సమోదు చేశాడు. మరోవైపు పడిక్కల్ వరుసగా మూడో టెస్టు శతకం సాధించే అవకాశాన్ని కోల్పోయాడు. జేమీసన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన గిల్ దూకుడుగా ఆడుతూ కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫోర్లు, సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే జాకబ్ డఫీ వేసిన చివరి ఓవర్‌లో బౌల్డ్ కావడంతో 98 పరుగుల వద్ద పెవిలియన్ చేరాడు. రాహుల్ ఔటైన తర్వాత పంత్ తనదైన శైలిలో చెలరేగాడు. డఫీ బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్సర్లు బాది అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 100 పరుగులు జోడించాడు. నాలుగో రోజు తొలి సెషన్‌లో మరింత ఆధిక్యం పెంచుకుని కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని భారత్ భావిస్తోంది.



ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ జోరు

- కొరియాపై 2–1తో విజయం
- చెరో గోల్ సాధించిన ముంతాజ్ ఖాన్, సునెలిత టోప్పో
- ఆరు పాయింట్లతో జపాన్‌తో కలిసి అగ్రస్థానంలో భారత్



భోపాల్: మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ జోరు కొనసాగిస్తోంది. శనివారం దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో 2–1తో విజయం సాధించింది. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు గోల్స్ చేయలేకపోయినా.. ఆ తర్వాతి రెండు క్వార్టర్లలో ముంతాజ్ ఖాన్, సునెలిత టోప్పో చెరో గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించారు. చివరి క్వార్టర్‌లో కొరియా ఒక గోల్ చేసినా.. భారత విజయాన్ని అడ్డుకోలేకపోయింది. టోర్నీలో భారత్‌కిది వరుసగా రెండో విజయం. తొలి మ్యాచ్‌లో మలేసియాను 4–1తో ఓడించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆరంభం నుంచే ఇరు జట్లు ఆచితూచి ఆడాయి. ప్రత్యర్థి దాడులను అడ్డుకుంటూనే.. గోల్ కోసం అవకాశాలు సృష్టించుకునేందుకు ప్రయత్నించాయి. తొలి 15 నిమిషాల్లో భారత్‌కు ఐదు పెనాల్టీ కార్నర్లు లభించినా గోల్ సాధించలేకపోయింది. కొరియా గోల్‌కీపర్ సియోయోన్ లీ చక్కటి రక్షణతో భారత ప్రయత్నాలను అడ్డుకుంది. కెప్టెన్ సలీమా టెటె, పూజా సాహా, నవనీత్ కౌర్ సమన్వయంతో భారత దాడులు కొనసాగాయి. చివరకు 30వ నిమిషంలో ముంతాజ్ ఖాన్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. సాక్షి అందించిన పాస్‌ను అందుకున్న నవనీత్.. ముంతాజ్‌కు బంతిని అందించగా ఆమె దాన్ని గోల్‌పోస్ట్‌లోకి పంపింది.

పెనాల్టీ కార్నర్‌తో మరో గోల్


రెండో అర్ధభాగం ప్రారంభమైన కొద్దిసేపటికే భారత్ ఆధిక్యాన్ని పెంచుకుంది. 34వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను సునెలిత టోప్పో గోల్‌గా మలిచింది. దీంతో భారత్ 2–0తో ముందంజలో నిలిచింది. మూడో క్వార్టర్ ముగిసే వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. చివరి క్వార్టర్‌లో కొరియా దూకుడు పెంచింది. 56వ నిమిషంలో హాంగ్ గోల్ చేయడంతో ఆధిక్యం 2–1కి తగ్గింది. చివరి నిమిషాల్లో భారత్ మరో గోల్ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు 2–1తో విజయం ఖరారైంది. ఈ విజయంతో భారత్ ఆరు పాయింట్లతో జపాన్‌తో కలిసి పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. రెండు జట్లకూ గోల్ వ్యత్యాసం +4గా ఉంది. చైనా నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా.. మలేసియా ఒక పాయింట్‌తో ఉంది. దక్షిణ కొరియా, థాయ్‌లాండ్ ఇంకా ఖాతా తెరవలేదు. శనివారం జరిగిన మరో మ్యాచ్‌లో చైనా, మలేసియా 2–2తో డ్రా చేసుకోగా.. జపాన్ 3–0తో థాయ్‌లాండ్‌ను ఓడించింది. జపాన్ తరఫున రిసా నసాకి రెండు గోల్స్ చేయగా.. రినా యమమోటో మరో గోల్ సాధించింది. భారత్ ఆదివారం థాయ్‌లాండ్‌తో తలపడనుంది.

పాక్ క్రికెట్‌లో మాజీలకు షాక్!

- కేంద్ర కాంట్రాక్టుల నుంచి మాజీ కెప్టెన్లు మసూద్, రిజ్వాన్ ఔట్
- 38 మందితో కొత్త ఫార్మాట్.. జాబితా ప్రకటించిన పీసీబీ
- టెస్టు, వన్డే, టీ20లకు వేర్వేరు కాంట్రాక్టులు
- 19మందికి డెవలప్‌మెంట్ కేటగిరీ

ఇస్లామాబాద్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కొత్త కేంద్ర కాంట్రాక్టుల జాబితాలో పలువురు కీలక ఆటగాళ్లకు చోటు కల్పించలేదు. మాజీ కెప్టెన్లు షాన్ మసూద్, మహమ్మద్ రిజ్వాన్‌లతో పాటు అబ్దుల్లా షఫీక్, సైమ్ అయూబ్, హసన్ అలీ, నోమన్ అలీల కాంట్రాక్టులను పునరుద్ధరించలేదు. శనివారం ప్రకటించిన ఈ జాబితాలో మొత్తం 38 మంది ఆటగాళ్లకు ఫార్మాట్ ఆధారంగా కాంట్రాక్టులు కేటాయించింది. కొత్త ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ మార్పులు చేసినట్లు పీసీబీ వెల్లడించింది. టెస్టు విభాగంలో అజాన్ అవైస్, మహమ్మద్ అబ్బాస్, సాజిద్ ఖాన్, సౌద్ షకీల్‌లకు మాత్రమే కాంట్రాక్టులు దక్కాయి. టెస్టు కెప్టెన్ బాబర్ ఆజమ్, నల్మాన్ అలీ ఆఘాలకు టెస్టు, వన్డే విభాగాల్లో చోటు కల్పించారు.

ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో పాకిస్థాన్ 1–0తో విజయం సాధించింది. రావల్పిండిలో జరిగిన రెండో టెస్టులో ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. వన్డే విభాగంలో షాహీన్ అఫ్రిది, అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, ఫఖర్ జమాన్, ఫ హీమ్ అష్రఫ్, హారిస్ రవూఫ్‌లకు కాంట్రాక్టులు ఇచ్చారు.



గాయం బాధిస్తున్నా.. అద్భుత పోరాటం

- షెల్టన్‌పై హోరాహోరీ పోరులో ఆల్కరాజ్ విజయం
- సెమీఫైనల్‌లో 3–6, 6–3, 7–6తో గెలుపు

టూరిన్: ఎడమ తొడ కండరాల గాయం ఇబ్బంది పెడుతున్నా.. స్పెయిన్ టెన్నిస్ స్టార్, ఏడు సార్లు గ్రాండ్‌స్లామ్ విజేత కార్లోస్ ఆల్కరాజ్ అద్భుత పోరాట పటిమ చూపించాడు. అమెరికా ఆటగాడు, యూఎస్ ఓపెన్ రన్నరప్ బెన్ షెల్టన్‌తో శనివారం జరిగిన ఏటీపీ ఫైనల్స్ సెమీఫైనల్లో 3–6, 6–3, 7–6 (1)తో విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. తొలి సెట్ కోల్పోయినప్పటికీ పట్టుదలతో పుంజుకుని వరుసగా రెండు సెట్లు గెలిచాడు. దీంతో తన వరుస విజయాల సంఖ్యను 13కు పెంచుకున్నాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన షెల్టన్ తొలి గేమ్‌లోనే అద్భుతమైన ఫోర్‌హ్యాండ్ వాలీతో ఆకట్టుకున్నాడు. రెండో గేమ్‌లో ఆల్కరాజ్ తొలి సర్వీస్‌ను ఫోర్‌హ్యాండ్ విన్నర్‌తో ఎదుర్కొని బ్రేక్ సాధించాడు. అదే జోరుతో తొలి సెట్‌ను 6–3తో సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో ఆల్కరాజ్ పుంజుకున్నాడు. కీలక దశలో షెల్టన్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 6–3తో సెట్‌ను గెలిచాడు.

టైబ్రేకర్‌లో ఆల్కరాజ్ ఆధిపత్యం

నిర్ణాయక మూడో సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. షెల్టన్ వరుస ఏస్‌లతో 5–4 ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే టైబ్రేకర్‌లో తొలి నుంచే ఆల్కరాజ్ ఆధిపత్యం ప్రదర్శించాడు. షెల్టన్ వరుసగా రెండు ఏస్‌లు సాధించినప్పటికీ, కీలక సమయాల్లో చేసిన తప్పిదాలు అతడిని దెబ్బతీశాయి. చివరకు 7–1తో టైబ్రేకర్‌ను గెలిచిన ఆల్కరాజ్ మ్యాచ్‌ను ముగించాడు.

గాయంపై రోజువారీగా నిర్ణయం

గ్రూప్ దశలో డానిల్ మెద్వెదేవ్‌తో మ్యాచ్ సందర్భంగా ఆల్కరాజ్ ఎడమ తొడ వెనుక భాగంలోని కండరానికి గాయమైంది. ఈ ఏడాది కుడి మణికట్టు గాయం కారణంగా నాలుగున్నర నెలల పాటు ఆటకు దూరమైన అనుభవం కూడా అతడికి ఉంది. ఆదివారం జరిగే ఫైనల్‌కు ముందు శారీరకంగా, మానసికంగా కోలుకోవడమే తనకు ముఖ్యమని ఆల్కరాజ్ తెలిపాడు. ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ అలెగ్జాండర్ జ్వెరెవ్ లేదా మెద్వెదేవ్‌తో తలపడనున్నాడు. ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ను ఆల్కరాజ్ ఇప్పటివరకు గెలవలేదు. గత ఏడాది ఫైనల్లో జానిక్ సినర్ చేతిలో ఓడిపోయాడు. వచ్చే వారం ఇటలీలోని బొలోనియాలో జరిగే డేవిస్ కప్ ఫైనల్–8లో స్పెయిన్ తరఫున కూడా ఆడాల్సి ఉంది. అయితే గాయం కారణంగా తన ఆటపై రోజువారీగా నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు.

జ్వెరెవ్–మెద్వెదేవ్ మధ్య మరో సెమీఫైనల్

మరో సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ అలెగ్జాండర్ జ్వెరెవ్, డానిల్ మెద్వెదేవ్ తలపడుతున్నారు. వీరిద్దరూ ఇప్పటివరకు 22 సార్లు ఎదురుపడగా.. మెద్వెదేవ్ 14 విజయాలతో ఆధిక్యంలో ఉన్నాడు. వీరి 23వ పోరు క్రియాశీల ఆటగాళ్ల మధ్య అత్యధిక ముఖాముఖి మ్యాచ్‌ల రికార్డుగా నిలవనుంది. ఇప్పటివరకు నొవాక్ జకోవిచ్, మారిన్ సిలిచ్ మధ్య జరిగిన 22 మ్యాచ్‌లే ఈ రికార్డులో ఉన్నాయి.

Printed, published and owned by Adula Thirupathi, printed at Ramani web offset printers, H.NO 8-82/11/1,Auto Nagar, Bommakal Road, village, mdl & Dist : Karimnagar 505001,Telangana,
Published from, 8-1-141, Giddheperumandla Nagar Road, Karimnagar, Telangana, **Editor : Gaddam Ravi.** Email: vemulawadavaartha@gmail.com. RNI NO. TEL TEL /2017/71143